మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

సోమవారం 26 -10-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 324



## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609



Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District


## శతకాల సునామీ.. సిరీస్ మనదే!

- రెండో వన్డేలో జింబాబ్వేపై భారత్ ఘన విజయం
- హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మ సెంచరీలతో పరుగుల వరద
- 121 పరుగుల తేడాతో ప్రత్యర్థిని చిత్తుచేసిన టీమిండియా
- 328 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన భారత మహిళలు
- వైష్ణవికి నాలుగు, దీప్తికి మూడు వికెట్లు
- మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2--0తో సిరీస్ కైవసం
- 28న నామమాత్రపు చివరి వన్డే




## ఫ్రాన్స్‌లో భగ్గుమన్న నిరసనలు..

- జీవన వ్యయం, నిరుద్యోగంపై ప్రజల ఆగ్రహం
- దేశవ్యాప్తంగా పలు నగరాలకు విస్తరించిన ఆందోళనలు
- పోలీసులు--నిరసనకారుల మధ్య తీవ్ర ఘర్షణలు
- దుకాణాల దహనం.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల ధ్వంసం
- టియర్ గ్యాస్, వాటర్ కెనాన్లతో నిరసనకారుల చెదరగొట్టివేత
- లియోన్, లిల్లె, మార్సెల్లి సహా పలు నగరాల్లో ఉద్రిక్తత







### ఎన్ని దాడులు చేసినా
## మా వైఖరి మారదు!

- అమెరికాకు ఇరాన్ మరోసారి స్పష్టమైన హెచ్చరిక
- మళ్లీ సైనిక చర్యకు దిగినా వెనక్కి తగ్గబోమన్న అరాగ్చీ
- మరోసారి దాడులు తప్పవన్న ట్రంప్ వ్యాఖ్యలపై స్పందన
- హార్ముజ్ జలసంధిలో పాత పరిస్థితులు రావన్న ఇరాన్
- కాల్పుల విరమణతోనే సరిపెట్టకుండా యుద్ధం పూర్తిగా ముగియాలి
- అమెరికా యుద్ధ విమానాలను ధ్వంసం చేశామంటూ ఇరాన్ విదేశాంగ మంత్రి ప్రకటన

# ఏపీపై



# తుఫాన్ పంజా..




- అప్రమత్తమైన సర్కార్!
- బంగాళాఖాతంలో బలపడుతున్న 'అర్ణబ్' తుఫాన్
- 28న బాపట్ల--విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 140 కి.మీ. వేగంతో పెనుగాలుల ముప్పు
- 27, 28 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాల హెచ్చరిక
- కాకినాడ, కోనసీమ, విశాఖ, అనకాపల్లి జిల్లాలపై అధిక ప్రభావం
- 10 ఎన్‌డీఆర్ఎఫ్, 11 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం
- మత్స్యకారులు వెంటనే తీరానికి చేరుకోవాలని ఆదేశాలు
- తుఫాన్ సన్నద్ధతపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

బంగాళాఖాతంలో బలపడుతున్న 'అర్ణబ్' తుఫాన్ ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాలను కలవరపెడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అక్టోబర్ 28న బాపట్ల--విశాఖపట్నం మధ్య తుఫాన్ తీరం దాటే అవకాశముందని, ఆ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచవచ్చని అధికారులు అంచనా వేశారు. ఉత్తరాంధ్ర, మధ్య కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సహాయక చర్యల కోసం 10 ఎన్‌డీఆర్ఎఫ్, 11 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని, సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు వెంటనే తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



### స్థానిక ఎన్నికలు కాదు..
## గ్యాంగ్ వార్!

- ఏపీలో రెండు కుటుంబాల ఆధిపత్య రాజకీయాలంటూ విజయసాయిరెడ్డి విమర్శలు
- రాష్ట్రాన్ని విధ్వంసం వైపు నడిపిస్తున్నారని తీవ్ర ఆరోపణ
- ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపాటు
- నామినేషన్లు చించేస్తున్నారంటూ అధికార పార్టీపై ఆరోపణలు
- పోలీసులు, రెవెన్యూ అధికారుల పాత్రపైనా తీవ్ర విమర్శలు
- 2021 నాటి వైసీపీ అరాచకాల కంటే పదింతలు ఎక్కువని వ్యాఖ్య
- రెండు కుటుంబాల ఆధిపత్యానికి ముగింపు పలకాలని పిలుపు
- రాష్ట్ర అభివృద్ధికి మూడో రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని అభిప్రాయం

అమరావతి, ఏపీ బ్యూరో,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో జరుగుతున్నది ఎన్నికలు కాదని, కేవలం గ్యాంగ్ వార్ మాత్రమేనని ఆయన ధ్వజమెత్తారు. రెండు కుటుంబాలకు చెందిన గ్యాంగులు రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి సోషల్ మీడియాలో స్పందిస్తూ.."ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల పేరుమీద జరుగుతున్నది గ్యాంగ్ వార్ మాత్రమే. బీహార్‌ను మించి పోయి, రెండు కుటుంబాలకు చెందిన ఒక హిందూ కుల గ్యాంగ్, మరో మైనారిటీ మతానికి చెందిన గ్యాంగ్‌లు మన రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తున్నాయి"

-మిగతా 3 లో




## మా ర్యాలీకి పబ్లిసిటీ చేస్తున్నందుకు థ్యాంక్స్'..

- బీజేపీపై రాహుల్‌గాంధీ వ్యంగ్యాస్త్రాలు..!
- నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ నిరసన ర్యాలీ
- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో రామ్‌లీలా మైదానం వరకు ప్రదర్శన
- ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలకు కృతజ్ఞతలంటూ రాహుల్ వ్యంగ్యం
- ఓటర్ల జాబితా నుంచి కోట్లాది పేర్ల తొలగింపుపై తీవ్ర ఆరోపణలు
- మూడు రోజులపాటు ఢిల్లీలోనే ఉండాలని కాంగ్రెస్ ఎంపీలకు ఆదేశాలు
- 10 లక్షల మంది హాజరవుతారన్న కాంగ్రెస్ నేతలు.. భద్రత కట్టుదిట్టం

## రాజకీయాల్లోకి ధనుష్?

- చెన్నైలో మహిళా అభిమాన సంఘాలతో ప్రత్యేక సమావేశం
- 58 జిల్లాల నుంచి హాజరైన మహిళా ప్రతినిధులు
- సమావేశంలో పాల్గొన్న సుమారు 3 వేల మంది అభిమానులు
- రాజకీయ ప్రవేశంపై తమిళనాట ఆసక్తికర చర్చ

తమిళ సినీ నటుడు ధనుష్ రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారంటూ ప్రచారం జోరందుకుంది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో పలువురు ప్రముఖులతో చర్చలు జరిపినట్లు వార్తలు రావడం, అనంతరం పెద్ద సంఖ్యలో మహిళా అభిమాన సంఘాల ప్రతినిధులతో సమావేశమైనట్లు కథనాలు వెలువడటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అభిమాన సంఘాలను బలోపేతం చేసుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ సమావేశాలు నిర్వహించారా? లేక రాజకీయ ప్రవేశానికి ముందస్తు సన్నాహాలా? అన్న ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. అయితే రాజకీయ అరంగేట్రంపై ధనుష్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఆయన సమావేశాలు, రాజకీయ ప్రవేశానికి సంబంధించిన ప్రచారంపై స్వతంత్ర ధ్రువీకరణ కూడా లభించలేదు.






## 2028లో మళ్లీ కేసీఆరే సీఎం..

- తెలంగాణను తిరిగి నంబర్ వన్‌గా నిలబెడతాం... కేటీఆర్
- కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుపై నిలదీత
- రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్న
- మైనారిటీ సంక్షేమానికి రూ.4 వేల కోట్ల కేటాయింపు ఎక్కడని విమర్శ
- పింఛన్ల పెంపు, రైతు భరోసా అమలుపై ప్రభుత్వానికి ప్రశ్నలు
- తెలంగాణను రాహుల్ గాంధీకి ఏటీఎంగా మార్చారని ఆరోపణ
- భూముల వ్యవహారాలు, వ్యాపార ఒప్పందాలపై విచారణకు డిమాండ్
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరిన జిబ్రాన్ షరీఫ్

హైదరాబాద్,

2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, తెలంగాణను తిరిగి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ రాహుల్ గాంధీకి ఏటీఎంగా మారిందని ఆరోపించారు.

-మిగతా 3 లో




### భారత బలగాలకు అసాధ్యమైన
## లక్ష్యమంటూ ఏదీ లేదు!

- ఆపరేషన్ సింధూర్‌తో భారత సైనిక శక్తి నిరూపితమైంది
- పాక్‌లోని ఉగ్రస్థావరాలపై కచ్చితమైన దాడులు చేశాం
- స్వదేశీ ఆయుధాల సత్తాను ప్రపంచానికి చాటిచెప్పాం
- అధునాతన క్షిపణి వ్యవస్థలతో మరింత బలోపేతమైన రక్షణ
- దేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి స్వదేశీ తయారీ కీలకం
- ఇండో-పసిఫిక్ పరిణామాలపై వైమానిక దళం నిరంతర నిఘా
- క్వాడ్ దేశాలతో రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేస్తాం
- పీటీఐ ఇంటర్వ్యూలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వ్యాఖ్యలు

### పరిషత్ పోరులో 51 వేల మందికిపైగా
# అభ్యర్థులు!

### ఏపీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థుల తుది జాబితా విడుదల

- 9,829 ఎంపీటీసీ స్థానాలకు 46,457 మంది బరిలో
- 659 జెడ్పీటీసీ స్థానాలకు 4,770 మంది పోటీ
- ఎంపీటీసీలో టీడీపీ నుంచి 19,760 మంది అభ్యర్థులు
- వైసీపీ నుంచి 17,726 మంది.. జనసేన నుంచి 4,330 మంది
- జెడ్పీటీసీలో టీడీపీ 1,693, వైసీపీ 1,445, జనసేన 587 మంది
- పరిషత్ ఎన్నికల తేదీలపై సుప్రీంకోర్టు తీర్పు కీలకం

**పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ 1న పోలింగ్, 3న కౌంటింగ్**

అమరావతి, ఆంధ్రప్రదేశ్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి ఊపందుకుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు భారీ సంఖ్యలో అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందడంతో గ్రామీణ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 9,829 ఎంపీటీసీ స్థానాలకు 46,457 మంది, 659 జెడ్పీటీసీ స్థానాలకు 4,770 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. రెండు విభాగాల్లో కలిపి మొత్తం 51,227 మంది నామినేషన్లు ఆమోదం పొందినట్లు ఎన్నికల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో రంగంలోకి దిగడంతో పలు నియోజకవర్గాల్లో బహుముఖ పోటీ నెలకొనే

-మిగతా 3 లో



# రూ.1 సిమ్‌తో బీఎస్ఎన్ఎల్ బంపరాఫర్

**రోజుకు 1 జీబీ డాటా అపరిమిత వాయిస్ కాల్స్ ఉచితం**




**న్యూఢిల్లీ:(డ్రీమ్ టైమ్స్),**
ప్రైవేట్ నెట్‌వర్క్‌లు ఇటీవల రీచార్జ్ ధరలను భారీగా పెంచడంతో ఇబ్బంది పడుతున్న వినియోగదారులకు ప్రభుత్వ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ శుభవార్త చెప్పింది. 'ఫ్రీడమ్ 2.0' ఆఫర్ పేరిట కేవలం ఒక్క రూపాయికే సిమ్ అందిస్తున్నది. ఇందులో 24 రోజుల పాటు ప్రతి రోజూ 1 జీబీ డాటా, అపరిమిత వాయిస్ కాల్స్, 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా లభిస్తాయి. ఈ ఏడాది నవంబర్ 9 వరకు మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఈ ఆఫర్ కేవలం కొత్త వినియోగదార్లకు మాత్రమేనని, ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ సిమ్‌ను వాడుతున్న పాత వినియోగదారులకు వర్తించదని అధికారులు చెప్పారు

# సర్' సాఫ్ట్‌వేర్‌ను వెల్లడించలేం అది వ్యాపార రహస్యం: ఈసీ



**న్యూఢిల్లీ:(డ్రీమ్ టైమ్స్),**
ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో లోటుపాట్లను గుర్తించేందుకు వాడిన సాఫ్ట్‌వేర్ వివరాలను వెల్లడించడానికి కేంద్ర ఎన్నికల సంఘం నిరాకరించింది. హిందూస్థాన్ టైమ్స్ నివేదిక ప్రకారం.. 'ఈ సమాచారం వ్యాపార రహస్యానికి, మేధో సంపదకు సంబంధించినది.దీన్ని సమాచార హక్కు చట్టం కింద బహిర్గతం చేయలేం' అని ఈసీ పేర్కొంది. ఓటర్ల జాబితాలో వ్యత్యాసాలను గుర్తించడానికి కృత్రిమ మేధ లేదా మెషీన్ లెర్నింగ్ ఉపయోగిస్తున్నారా లేదా అనే విషయాన్ని ఈసీ స్పష్టం చేయలేదు. సాఫ్ట్‌వేర్ సొంతంగా తప్పులను గుర్తిస్తుందా అనే ప్రశ్న స్పష్టతను కోరేదని పేర్కొంటూ దానికి సమాధానాన్ని నిరాకరించింది.

సాఫ్ట్‌వేర్‌పై ఈసీ సమాచారాన్ని దాస్తున్నది: కాంగ్రెస్

ఈసీఐనెట్ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన కీలక సమాచారాన్ని ఎన్నికల సంఘం దాచి పెట్టిందని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ ఆదివారం ఆరోపించారు. హిందూస్థాన్ టైమ్స్ రిపోర్ట్‌ను ప్రస్తావిస్తూ పారదర్శకత లోపించడం, కృత్రిమ మేధను ఉపయోగించడం వల్ల 'సర్' ప్రక్రియ విశ్వసనీయత దెబ్బతిన్నదని విమర్శించారు.

# పెరగనున్న సబ్బులు, వంటనూనెల ధరలు




**న్యూఢిల్లీ (డ్రీమ్ టైమ్స్),**
ఇప్పటికే బియ్యం, పప్పులు, గ్యాస్, పెట్రోల్ ధరల పెంపుతో ఇబ్బంది పడుతున్న సామాన్యుడిపై మరో పిడుగు పడనుంది. త్వరలోనే సబ్బులు, టూత్‌పేస్ట్‌లు, వంటనూనెలు, చాక్లెట్ల వంటి ధరలు పెరగనున్నాయి. క్రూడ్ చమురు ధరలు పెరగడంతో ముడిసరుకుల ధరలు 74 శాతం వరకు పెరగడమే కాక, బలహీనమైన వర్షపాతం నమోదుతో పలు పంట ఉత్పత్తులు తగ్గడంతో ఎఫ్ఎంసీజీ కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను పెంచేందుకు నిర్ణయించాయి.చమురు ధరలు బ్యారెల్‌కు 113 డాలర్లకు చేరడంతో ఉత్పత్తి వ్యయాలపై దాని ప్రభావం గణనీయంగా పడిందని క్రైసిల్, ఎలరా క్యాపిటల్, కొటక్ నియో సంస్థల విశ్లేషకులు పేర్కొన్నారు. డిసెంబర్ నుంచి టెలిఫోన్ బిల్లులు పెరగనున్నట్టు అంబిత్ క్యాపిటల్ అంచనా వేసింది.

# ఆలయాల్లో భద్రతకు అమెరికా రూ.100 కోట్ల ప్రణాళిక

**ఇల్లినాయిస్ (డ్రీమ్ టైమ్స్),**
అమెరికాలోని ఇల్లినాయిస్‌లో హిందూ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడి కుట్ర వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, దీపావళికి ముందుగా అమెరికాలోని హిందూ దేవాలయాలు, మతపరమైన సంస్థల భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని ట్రంప్



ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 500 దేవాలయాల భద్రత కోసం రూ.100 కోట్లు కేటాయించినట్లు సమాచారం.ఈ భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఆలయ ప్రాంగణాలను నిరంతరం పర్యవేక్షించేందుకు కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, నిఘా అలారంలను సమకూర్చనున్నారు. అత్యధిక సంఖ్యలో ప్రజలు వచ్చే దేవాలయాల వద్ద శిక్షణ పొందిన, లైసెన్సులు కలిగిన సాయుధ గార్డులను నియమించనున్నారు.

# జెన్-జీకి ఎమ్మెస్ ధోని సూచన..

**- అలాంటి అలవాట్లతో ఆరోగ్యం పాడవుతుందంటూ ఆందోళన**



**న్యూఢిల్లీ(డ్రీమ్ టైమ్స్),**
: జెన్-జీ ఆహారపు అలవాట్లు, జీవనశైలిపై భారత మాజీ క్రికెటర్ ఎమ్మెస్ ధోని ఆందోళన వ్యక్తం చేశారు. వీటివల్ల దీర్ఘకాలికంగా వారి ఆరోగ్యం పాడయ్యే అవకాశం ఉందన్నారు. తాజాగా ఒక కార్యక్రమంలో ప్రముఖ రచయిత జావేద్ అక్తర్‌తో కలిసి ధోని పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెన్-జీకి కీలక సూచన చేశారు. జెన్-జీ, జెన్-ఆల్ఫా పాటిస్తున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలితో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. వారి ఆహారపు అలవాట్లు ఆందోళనకరంగా ఉన్నాయని, మార్చుకోవాలని సూచించారు.అలాగే, శారీరక శ్రమ, మంచి ఆహారంపై దృష్టి సారించాలన్నారు. అయితే, ఇప్పటి తరంలో కొందరు గతంకంటే మెరుగైన సామాజిక, నైతిక విలువలు పాటిస్తున్నారని, ఇది హర్షణీయం అన్నారు. అలాగే, పెద్దలు కూడా ఎప్పుడూ తామే సరైన వాళ్లం అనుకోకుండా, కొత్త తరం నుంచి కూడా నేర్చుకోవడానికి ప్రయత్నించాలని సలహా ఇచ్చారు. భారతీయులు ఎక్కువగా కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారం తీసుకుంటారనే విషయంపై కూడా ధోని మాట్లాడారు. భారతీయుల జీవనశైలి, శారీరక శ్రమ కారణంగా కార్బోహైడ్రేట్లు ఎక్కువగా తీసుకోవాల్సి వచ్చిందన్నారు.ప్రస్తుతం మారిన రోజువారీ జీవనశైలి, ఎక్కువగా యాక్టివ్‌గా లేకపోవడం, ఒకేరకమైన ఆహారం తీసుకోవడం వంటివి ఇప్పుడు చాలా మందికి సరిపోకపోవచ్చు అన్నారు. ఆహారపు అలవాట్లు ప్రాంతాన్నిబట్టి వేరుగా ఉంటాయని, అందరికీ ఒకే రకమైన ఆహారం సరిపోదని ధోని అన్నారు. నేటి కాలంలో చాలా మంది శారీరక శ్రమకు దూరంగా ఉంటున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లి ఉబర్ కార్ లేదా ఆటో ఎక్కుతున్నారు. కూర్చుని వెళ్లి, కూర్చుని పని చేస్తున్నారు. దీంతో శారీరక శ్రమ తగ్గుతూ వస్తోంది. ఇప్పుడు ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి కూడా పెరిగిపోయింది. చక్కెర ఉండే ఫుడ్, ఫ్రైడ్ ఫుడ్ ఇలా మార్కెట్లో దొరుకుతోంది. అయితే, శారీరక శ్రమ తక్కువగా ఉండేవారికి ఇలాంటి ఆహారం సరిపోదు అంటూ ధోని వ్యాఖ్యానించారు.

# 'మన్ కీ బాత్' కు 12 ఏళ్లు పూర్తి..

**-అదొక తీర్థయాత్ర లాంటిదన్న ప్రధాని మోదీ..!**



**న్యూఢిల్లీ(డ్రీమ్ టైమ్స్),**
నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్ పన్నెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ తన అనుభవాలను పంచుకున్నారు. ఈ ప్రయాణం తనకు ఒక 'తీర్థయాత్ర ' లాంటిదని, దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సామాన్యులు చేస్తున్న అసాధారణమైన కృషిని గౌరవించుకునే మార్గమని అన్నారు. 'మన్ కీ బాత్' 139వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. ఈ ప్రయాణంలో తనకు తోడుగా నిలిచి స్ఫూర్తినిచ్చిన శ్రోతలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.పన్నెండేళ్ల క్రితం విజయదశమి పర్వదినాన మనం 'మన్ కీ బాత్' ప్రారంభించామని, అప్పటి నుంచి మన ప్రయాణం నిరంతరాయంగా కొనసాగుతోందని ప్రధాని గుర్తుచేశారు. ఈ ప్రయాణంలో మీరంతా సహ ప్రయాణికులుగా, స్ఫూర్తిదాతలుగా ఉన్నారని శ్రోతలను ఉద్దేశించి అన్నారు. శతాబ్దాలుగా మన దేశంలో తీర్థయాత్రల సంప్రదాయం ఉందని, దేశ ప్రజల కృషిని దగ్గర నుంచి అర్థం చేసుకోవడానికి, వారి సేవలకు వందనం చేయడానికి 'మన్ కీ బాత్' తనకు ఒక తీర్థయాత్ర కన్నా తక్కువేమీ కాదని చెప్పారు. సమాజం కోసం, దేశం కోసం జీవించే వ్యక్తులు స్వయంగా పుణ్యక్షేత్రాల వంటివారని ప్రధాని కొనియాడారు. దేశంలోని సామాన్య ప్రజల కృషినీ, ధైర్యాన్ని, అంకితభావాన్ని, సేవా స్ఫూర్తిని చాటిచెప్పేందుకు 'మన్ కీ బాత్' ఒక అద్భుతమైన అవకాశమని ప్రధాని అన్నారు. ఈ పన్నెండేళ్లలో సమాజం దృష్టికి రాని ఎందరో మహానుభావుల అసాధారణమైన పనులను ఈ కార్యక్రమం ద్వారా దేశం ముందుంచామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం ద్వారా తాను ఒకరకంగా మన దేశ ప్రజల శక్తికి నివాళులు అర్పిస్తున్నానని అన్నారు. దేశంలోని ప్రతి కుటుంబంతోనూ అనుబంధం పెంచుకునే అవకాశం నాకు లభించిందని చెప్పారు. చాలామంది ప్రజలు తనకు సందేశాలు పంపుతూ.. 'మన్ కీ బాత్' వింటున్నప్పుడు, తమ మధ్యలో ఒక కుటుంబసభ్యుడిగా కూర్చుని మాట్లాడుతున్నట్లు అనిపిస్తుందని చెబుతుంటారని మోదీ ఆనందం వ్యక్తంచేశారు. "శ్రోతలైన మీ అందరి ఆత్మీయత, అనురాగం నాకు నిజంగా అమూల్యమైన ఆస్తి" అని ప్రధాని భావోద్వేగంగా అన్నారు. తొలి 'మన్ కీ బాత్' కార్యక్రమం 2014 అక్టోబర్ 3న విజయదశమి రోజున ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్‌లలో ప్రసారమైంది. అప్పటి నుంచి ప్రతి నెల చివరి ఆదివారం ఈ కార్యక్రమం కొనసాగుతూ వచ్చింది.

# సౌదీ అరేబియాపై డ్రోన్లు, మిస్సైల్స్ దాడి.

**-ఆ వీడియోలు షేర్ చేయొద్దంటూ భారతీయులకు వార్నింగ్**



**న్యూఢిల్లీ(డ్రీమ్ టైమ్స్),**
: సౌదీ అరేబియాపై హౌతీ ఉగ్రవాదులు వరుసగా దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. వివిధ రకాల డ్రోన్లు, మిస్సైళ్లతో దాడులకు దిగుతుంది. అయితే, ఈ దాడులకు సంబంధించిన వీడియోలు షేర్ చేయొద్దని సౌదీ అరేబియా ప్రభుత్వం సూచించింది. సౌదీలో ఉంటున్న భారతీయులు ఈ ఆదేశాన్ని పాటించాలని సూచించింది. ఇండియాతోపాటు ఇతర దేశాల ప్రజలు కూడా ఇదే సూచన చేసింది. వివిధ ఈ మేరకు ఎక్స్ వేదికగా సౌదీ ప్రభుత్వం ప్రకటించింది.దీన్ని సౌదీలోని భారత రాయబార కార్యాలయం రీట్వీట్ చేసింది. సౌదీలో ఉంటున్న భారతీయులు ఈ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించింది. ఈ సూచనల ప్రకారం.. సౌదీ అరేబియాలోని వివిధ ఎయిర్‌పోర్టులు, చమురు క్షేత్రాలపై హౌతీలు దాడులు చేస్తున్నారు. డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడికి పాల్పడుతున్నారు. అయితే, వీటిలో కొన్నింటిని సౌదీ రక్షణ విభాగం అడ్డుకుంటోంది. హౌతీల దాడులు.. పలు భవనాలు ధ్వంసం కావడం.. కొన్నింటిని సౌదీ అడ్డుకుని గాలిలోనే పేల్చేయడం వంటివి జరుగుతున్నాయి.వీటన్నింటిని అక్కడ ఉన్న స్థానికులు తమ సెల్‌ఫోన్లలో వీడియోలు తీస్తున్నారు. వాటిని సోషల్ మీడియా, వాట్సాప్‌లలో షేర్ చేస్తున్నారు. ఈ అంశంపైనే సౌదీ స్పందించింది. భారతీయులు సహా తమ దేశంలో ఉంటున్న వారెవరూ వాటిని వీడియో తీయొద్దని, షేర్ చేయవద్దని సూచించింది. ఈ నిబంధన అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. హౌతీల దాడుల నేపథ్యంలో రియాద్, దమ్మామ్ సహా పలు ఎయిర్‌పోర్టుల నుంచి విమానయాన సేవల్నినిలిపివేస్తున్నట్లు సౌదీ ప్రకటించింది. నవంబర్ 7 వరకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందని ప్రకటించింది.

# ఏఐ దెబ్బ.. 'గెట్టి ఇమేజెస్' దివాలా

**4.8 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ ఆవిరి**




**న్యూఢిల్లీ(డ్రీమ్ టైమ్స్),**
: ఏఐ ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో చెప్పే ఘటన ఇది. ఏఐ రాక ముందు ఫొటోగ్రఫీ ప్రపంచాన్ని దశాబ్దాల పాటు ఏలిన గెట్టి ఇమేజెస్ కంపెనీ దివాలా తీసింది. దాదాపు 4.8 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన ఈ కంపెనీ.. ఇప్పుడు అప్పులభారంతో దివాలా తీసేదాకా వచ్చింది. ఒకప్పుడు ప్రింట్ మీడియా, డిజిటల్, న్యూస్ పోర్టల్ ఇలా అనేక రంగాలకు తమ ఫొటోలను అందించింది ఈ సంస్థ. కానీ ఏఐ వచ్చిన తర్వాత అన్ని రంగాలు ఫొటోలను తామే జనరేట్ చేసుకుంటున్నాయి. జెట్టి పెయిడ్ ఫొటోలను ఎవరూ వాడకపోవడంతో నష్టాలు తలెత్తాయి.

# నర్మద ఒడ్డున వేలాది ఓటరు కార్డులు

**విచారణకు విపక్షం డిమాండ్**



**భోపాల్:(డ్రీమ్ టైమ్స్),**
మధ్యప్రదేశ్‌లోని నర్మదా నది ఒడ్డున వేలాది ఓటరు ఐడీ కార్డులు పడి ఉండటం రాజకీయంగా సంచలనం సృష్టించింది. ఖర్గోన్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని విపక్ష కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మండలేశ్వర్‌లో నిస్వార్థ్ సేవా సమితి సభ్యులు ఒక ఘాట్‌ను శుభ్రం చేస్తుండగా అక్కడ వేలాది ఓటరు ఐడీ కార్డులు ఉండటాన్ని గమనించారు. వెంటనే వారు అధికారులకు ఫిర్యాదు చేశారు.

# మోదీ నాన్న కూడా వెళ్లాల్సిందే

**కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు.. అమిత్ షా అభ్యంతరం**



**పాట్నా, (డ్రీమ్ టైమ్స్),**
ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహనం కోల్పోయి ప్రధాని నరేంద్ర మోదీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీహార్‌లోని పాట్నాలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ ప్రధానిపై విమర్శలు చేస్తున్న క్రమంలో 'మోదీ ఎక్కడికీ వెళ్లబోరు' అంటూ సభికుల్లో ఒకరు చేసిన వ్యాఖ్యలపై ఖర్గే సహనం కోల్పోయారు. 'మోదీయే కాదు ఆయన బాబు (తండ్రి) కూడా వెళ్లాల్సిందే' అంటూ ఆయన ప్రతిస్పందించిన తీరు ఇప్పుడు వివాదానికి దారితీసింది.నల్లధనాన్ని వెనక్కి తెస్తానంటూ మోదీ చేసిన వాగ్దానంపై, ఆయన అనుసరిస్తున్న ఆర్ఎస్ఎస్ భావజాలంపై తీవ్రంగా విమర్శలు చేసిన ఖర్గే.. మోదీ ప్రధానిగా కొనసాగినంత కాలం దేశంలో శాంతి ఉండదని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగానికి విరుద్ధ అభిప్రాయాలు కలిగి ఉన్నాయని విమర్శించారు. సోషలిస్ట్ సిద్ధాంతంతో ఏర్పడిన జనతా దళ్ (యునైటెడ్) పార్టీని ఎన్డీఏ కూటమిలో చేర్చడం ద్వారా ఆ భావజాలానికి బీహార్ మాజీ సీఎం నితీశ్ కుమార్ నీళ్లు వదిలారని అన్నారు. ఖర్గే వ్యాఖ్యలను హోం మంత్రి అమిత్ షా తప్పుబట్టారు. ప్రధాని దివంగత తండ్రి గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం ద్వారా ఖర్గే మర్యాద హద్దులన్నింటినీ దాటేశారని విమర్శించారు.

# ఫ్రాన్స్‌లో భగ్గుమన్న నిరసనలు..




న్యూఢిల్లీ
ఫ్రాన్స్‌లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నిరసన ప్రదర్శనలు హింసాత్మకంగా మారాయి. మొదట ఫ్రాన్స్ వరకే పరిమితమైన ఆందోళనలు ఇప్పుడు అనేక పట్టణాలకు విస్తరించాయి. ప్రజలు, యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలపడంతో ఆందోళన ఉధృతంగా కొనసాగుతోంది. జీవన వ్యయం పెరగడం, నిత్యవసరాల సరుకులు అందుబాటులో లేకపోవడం, నిరుద్యోగం వంటి సమస్యల్ని నిరసిస్తూ ఫ్రాన్స్‌లో ప్రజలు ఆందోళనబాట పట్టారు. ఈ క్రమంలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తీవ్ర ఘర్షణ చెలరేగింది. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు 1,000 మందిని అరెస్టు చేశారు. ఈ విషయాన్ని ఫ్రాన్స్ రక్షణ శాఖ మంత్రి లారెంట్ నునెజ్ వెల్లడించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. స్థానిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా 4,10,000 మంది ఆందోళనల్లో పాల్గొన్నారు. అయితే, నిర్వాహకులు మాత్రం 8,00,000 మంది ఆందోళనల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగుతున్న ఈ ఆందోళనల్లో కొందరు నిరసనకారులు షాపులు దహనం చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల్ని ధ్వంసం చేస్తున్నారు. షాపుల్ని లూటీ చేస్తున్నారు. దీంతో తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతోంది. కోర్స్ డి విన్సెన్నెస్ ప్రాంతంలో ఆందోళనకారుల్ని చెదరగొట్టారు. ఈ ప్రాంతంలో పోలీసులకు, నిరసనకారులకు మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తింది. ఆందోళనకారుల్ని అదుపు చేసేందుకు హెలికాప్టర్లను కూడా వాడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఆందోళనల్ని అదుపు చేయడానికి వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్, గ్రెనడ్లు వంటివి వాడుతున్నట్లు వివరించారు. శాంతి భద్రతల స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. లియోన్, లిల్లె, మార్సెల్లి సహా ఇతర పట్టణాల్లోనూ ఆందోళనలు జరిగాయి.

# రాజకీయాల్లోకి ధనుష్?



చెన్నై:
తమిళ సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు ధనుష్ రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారనే ప్రచారం ఆసక్తి రేపుతోంది. ఇటీవల ఢిల్లీలో పలువురు కీలక వ్యక్తులతో సమావేశమైనట్లు వార్తలు వెలువడిన నేపథ్యంలో తాజాగా చెన్నైలో మహిళా అభిమాన సంఘాల ప్రతినిధులతో ఆయన భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పరిణామాలతో ధనుష్ రాజకీయ ప్రవేశానికి సన్నాహాలు చేస్తున్నారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. చెన్నై నగరంలోని చోళింగనల్లూరు ప్రాంతంలో ఉన్న జెప్పియార్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం మహిళా అభిమాన సంఘాల సమావేశం నిర్వహించినట్లు సమాచారం. తమిళనాడులోని 58 జిల్లాల నుంచి మహిళా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరైనట్లు కథనాలు పేర్కొన్నాయి. సుమారు మూడు వేల మంది మహిళా అభిమానులు పాల్గొన్న ఈ సమావేశం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగినట్లు తెలుస్తోంది. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ధనుష్ పలువురు ప్రముఖులతో చర్చలు జరిపినట్లు ప్రచారం జరుగుతోంది. ఆ తర్వాత పెద్ద సంఖ్యలో మహిళా అభిమాన సంఘాల ప్రతినిధులతో సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. అభిమాన సంఘాలను మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించారా, లేక రాజకీయ ప్రవేశానికి ముందస్తు సన్నాహాలా అన్న అంశంపై ఆసక్తి నెలకొంది. అయితే రాజకీయాల్లోకి ప్రవేశించే విషయమై ధనుష్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. మహిళా అభిమానులతో సమావేశం జరిగినట్లు వచ్చిన కథనాలు, రాజకీయ ప్రవేశానికి సంబంధించిన ప్రచారాన్ని స్వతంత్రంగా ధ్రువీకరించాల్సి ఉంది.

# ఎన్ని దాడులు చేసినా మా వైఖరి మారదు!



టెహ్రాన్:
అమెరికా మరోసారి సైనిక దాడులకు దిగినా తమ దేశ విధానాల్లో ఎలాంటి మార్పు ఉండబోదని ఇరాన్ స్పష్టం చేసింది. ఎన్ని దాడులు జరిగినా తమ వైఖరి మార్చుకునే ప్రసక్తే లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తేల్చిచెప్పారు. ఇరాన్‌పై మరోసారి సైనిక చర్య చేపట్టే అవకాశం ఉందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన స్పందించారు. యుద్ధం జరిగినా, జరగకపోయినా తమ దేశ విధానాలు యథాతథంగా కొనసాగుతాయని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో మరోసారి యుద్ధం ప్రారంభమయ్యే అవకాశాలపై చర్చ జరుగుతోందని అరాగ్చీ తెలిపారు. అమెరికా మరోసారి దాడులకు సిద్ధమవుతోందనే ప్రచారం నేపథ్యంలో తమ వైఖరిని స్పష్టం చేస్తున్నామని చెప్పారు. అమెరికా హేతుబద్ధంగా ఆలోచిస్తే ఇరాన్‌పై మరోసారి యుద్ధానికి దిగబోదని వ్యాఖ్యానించారు. సైనిక చర్యలతో తమ దేశాన్ని లొంగదీసుకోవడం సాధ్యం కాదని పేర్కొన్నారు. హార్ముజ్ జలసంధిలో పరిస్థితులు గతంలో మాదిరిగా ఉండబోవని అరాగ్చీ వెల్లడించారు. యుద్ధానికి ముందు ఉన్న స్థితికి జలసంధి తిరిగి వెళ్లే అవకాశం లేదన్నారు. గత ఘర్షణలు ప్రాంతీయ భద్రతా వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపాయని పేర్కొన్నారు. తాము 'రమదాన్ యుద్ధం'గా పేర్కొంటున్న ఈ ఘర్షణ పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితులను పూర్తిగా మార్చివేసిందని అభిప్రాయపడ్డారు. కేవలం కాల్పుల విరమణతో సమస్యకు పరిష్కారం లభించదని, అన్ని రంగాల్లో యుద్ధం పూర్తిగా ముగిసేలా చర్యలు ఉండాలని అరాగ్చీ డిమాండ్ చేశారు. తాత్కాలికంగా దాడులను నిలిపివేయడం కాకుండా భవిష్యత్తులో మరోసారి ఘర్షణలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం అవసరమని పేర్కొన్నారు. గత యుద్ధంలో అమెరికాకు చెందిన 80 యుద్ధ విమానాలను క్షిపణులతో కూల్చివేశామని అరాగ్చీ ప్రకటించారు. ఈ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలకు భారీ నష్టం కలిగించామని, వందలాది భవనాలను ధ్వంసం చేశామని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ సైనిక నష్టాలకు సంబంధించి ఇరాన్ చేసిన ప్రకటనలకు స్వతంత్ర ధ్రువీకరణ లేదు. అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అరాగ్చీ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## స్థానిక ఎన్నికలు కాదు..
# గ్యాంగ్ వార్!

మొదటి తరువాయి



అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు కుటుంబ గ్యాంగులకు అధికారం దక్కకుండా చేస్తే తప్ప ఏపీలో ప్రజలకు రక్షణ ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రానికి అభివృద్ధి కేవలం మూడవ ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ వలనే సాధ్యమవుతుందని, అదే ఏపీకి శరణ్యమని విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు.

**ప్రస్తుత ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు**

ప్రస్తుత ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. "అధికార పార్టీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు.. ఈ ముగ్గురు కలిసి ఒక కూటమిగా ఏర్పడి, స్థానిక ఎన్నికల్లో పోటీపడి నామినేషన్లు చించేస్తున్నారు" అని విమర్శించారు. 2021లో వైసీపీ చేసిన అరాచకం కంటే పదింతలు ఎక్కువ అరాచకం ఈ రోజు స్థానిక సంస్థల ఎన్నికల్లో కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు

# శతకాల సునామీ.. సిరీస్ మనదే!




వడోదర, స్పోర్ట్స్ డెస్క్: భారత మహిళల క్రికెట్ జట్టు సొంతగడ్డపై మరోసారి విజయదుందుభి మోగించింది. జింబాబ్వేతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సొంతం చేసుకుంది. ఆదివారం వడోదర వేదికగా జరిగిన రెండో వన్డేలో భారత బ్యాటర్లు శతకాలతో చెలరేగగా, బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థిని కట్టడి చేశారు. హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ సెంచరీలతో పరుగుల వరద పారించడంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 328 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అనంతరం 329 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 48.5 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత్ 121 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌లో 2--0 ఆధిక్యాన్ని అందుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే స్మృతి మంధాన పరుగుల ఖాతా తెరవకుండానే వెనుదిరిగింది. మూడో ఓవర్‌లో షఫాలీ వర్మ కూడా ఎనిమిది పరుగులకే ఔటైంది. దీంతో భారత్ కేవలం 19 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ప్రతీకా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టును ఆదుకునే బాధ్యత తీసుకున్నారు. ప్రారంభంలో ఆచితూచి ఆడిన ఈ జోడీ క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత దూకుడు పెంచింది. జింబాబ్వే బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ప్రతీకా రావల్ చక్కటి షాట్లతో ఆకట్టుకుంది. 57 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్న ఆమె 67 బంతుల్లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 61 పరుగులు చేసింది. హర్మన్‌ప్రీత్‌తో కలిసి మూడో వికెట్‌కు 124 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. ప్రతీకా ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన తేజల్ హసబ్నిస్ మూడు పరుగులకే వెనుదిరగడంతో భారత్ 148 పరుగుల వద్ద నాలుగో వికెట్ కోల్పోయింది. కీలక సమయంలో వరుస వికెట్లు పడటంతో భారీ స్కోరు సాధించడం కష్టమేనని భావించినప్పటికీ హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశారు. ఐదో వికెట్‌కు జతకట్టిన హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మ జింబాబ్వే బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఒకవైపు హర్మన్‌ప్రీత్ భారీ షాట్లతో విరుచుకుపడగా, మరోవైపు దీప్తి శర్మ వేగంగా పరుగులు రాబట్టింది. దీప్తి కేవలం 37 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుంది. హర్మన్‌ప్రీత్ 101 బంతుల్లో శతకాన్ని అందుకుంది. వీరిద్దరి దూకుడుతో భారత స్కోరు 300 పరుగుల మైలురాయిని దాటింది. హర్మన్‌ప్రీత్ 121 బంతుల్లో 15 ఫోర్లతో 126 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు పునాది వేసింది. హర్మన్‌ప్రీత్ వెనుదిరిగిన తర్వాత కూడా దీప్తి శర్మ తన జోరును కొనసాగించింది. కేవలం 83 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్న ఆమె 86 బంతుల్లో 15 ఫోర్లతో 106 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి శతకం సాధించిన దీప్తి భారత ఇన్నింగ్స్‌కు మరింత బలాన్ని చేకూర్చింది. హర్మన్‌ప్రీత్, దీప్తి అద్భుత భాగస్వామ్యంతో టీమిండియా 328 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. లక్ష్య ఛేదనలో జింబాబ్వే బ్యాటర్లు కొంత ప్రతిఘటన కనబరిచినప్పటికీ భారత బౌలర్ల ధాటికి నిలువలేకపోయారు. మోడెస్టర్ ముపచిక్వా 49 పరుగులతో రాణించగా, చిపో ముగేరి తిరిపానో 46 పరుగులు చేసింది. చెలోన్‌డీ బీయా 34, కెప్టెన్ జోసెఫిన్ నకోమో 22, న్యాషా 20 పరుగులు చేశారు. అయితే కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడంతో జింబాబ్వే లక్ష్యానికి చాలా దూరంలో నిలిచిపోయింది. భారత బౌలర్లలో వైష్ణవి శర్మ నాలుగు వికెట్లతో విజృంభించింది. బ్యాటింగ్‌లో సెంచరీ సాధించిన దీప్తి శర్మ బౌలింగ్‌లోనూ మూడు వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. మిగతా బౌలర్లు కూడా సమష్టిగా రాణించడంతో జింబాబ్వే 207 పరుగులకే ఆలౌటైంది. శతకంతో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన హర్మన్‌ప్రీత్ కౌర్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఈ విజయంతో భారత మహిళల జట్టు మూడు వన్డేల సిరీస్‌ను 2--0తో కైవసం చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమష్టి ప్రదర్శన కనబరిచిన టీమిండియా ఇప్పుడు క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. ఇరు జట్ల మధ్య నామమాత్రపు మూడో వన్డే అక్టోబర్ 28న జరగనుంది.

# ఏపీపై తుఫాన్ పంజా..



**అమరావతి, ఏపీ బ్యూరో,**
బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుఫానుగా బలపడుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. అక్టోబర్ 28న తుఫాను రాష్ట్ర తీరాన్ని తాకే అవకాశముండటంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు, పెనుగాలుల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆదివారం ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించిన సీఎం తుఫాను ప్రభావిత జిల్లాల్లో చేపట్టాల్సిన సహాయక, పునరావాస కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. అధికారులు వెల్లడించిన వాతావరణ అంచనాల ప్రకారం బంగాళాఖాతంలోని వాయుగుండం అక్టోబర్ 26న తుఫానుగా, అనంతరం తీవ్ర తుఫానుగా బలపడే అవకాశముంది. అక్టోబర్ 27 నాటికి మరింత తీవ్రరూపం దాల్చవచ్చని అంచనా వేస్తున్నారు. అక్టోబర్ 28న ఉదయం నుంచి మధ్యాహ్నం మధ్య బాపట్ల--విశాఖపట్నం తీరప్రాంతంలో తీరం దాటే అవకాశముందని అధికారులు వివరించారు. ముఖ్యంగా కోనసీమ, యానాం, కాకినాడ తీర ప్రాంతాలపై ప్రభావం ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేశారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముండగా, గరిష్టంగా 140 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవచ్చని హెచ్చరించారు. తుఫాను ప్రభావంతో అక్టోబర్ 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర, మధ్య కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నారు. కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో గాలులు, వర్షాల ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని అధికారులు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో 292.55 మిల్లీమీటర్లు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 281.17 మిల్లీమీటర్లు, విశాఖపట్నంలో 253.87 మిల్లీమీటర్లు, శ్రీకాకుళంలో 249.18 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశమున్నట్లు సమీక్షలో అంచనాలను వివరించారు. తుఫాను తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సహాయక చర్యల కోసం 10 ఎన్‌డీఆర్‌ఎఫ్, 11 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారుల బోట్లన్నీ వెంటనే తీరానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చూడాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు. భారీ గాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే తక్షణమే పునరుద్ధరించేందుకు అవసరమైన సిబ్బంది, సామగ్రిని సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. భారీ వర్షాల వల్ల వచ్చే వరద నీటిని సాధ్యమైనంత వరకు రిజర్వాయర్లలో నిల్వ చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని జలవనరుల శాఖను ఆదేశించారు. అయితే నీటి నిల్వలు, వరద ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, డీజీపీ హరీశ్ గుప్తా, జిల్లా కలెక్టర్లు, ఆర్టీజీ అధికారులతో పాటు వ్యవసాయ, విద్యుత్, జలవనరులు, హోం, వైద్యారోగ్య, పౌరసరఫరాలు, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ తుఫాను పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలు అధికారిక హెచ్చరికలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# భారత బలగాలకు అసాధ్యమైన లక్ష్యమంటూ ఏదీ లేదు!



న్యూఢిల్లీ
భారత బలగాలకు అందని లక్ష్యమంటూ ఏదీ లేదని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ అన్నారు. గత ఏడాది పాక్‌లోని ఉగ్రస్థావరాలపై 'ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ చేపట్టిన కచ్చితమైన దాడులు ఈ విషయాన్ని నిరూపించాయన్నారు. ఆ సమయంలో వాయుసేన వ్యూహాత్మకంగా ముందడుగు వేసి, ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బ కొట్టిందని చెప్పారు. ప్రస్తుతం సైన్యం వద్ద ఉన్న అణ్వాయుధాలు, కచ్చితత్వంతో ఛేదించగల అధునాతన క్షిపణి వ్యవస్థలు శత్రువుల గుండెల్లో వణుకు పుట్టిస్తున్నాయన్నారు. ఆ ఆపరేషన్‌తో స్వదేశీ ఆయుధాల శక్తిని ప్రపంచ దేశాలు చూశాయని పునరుద్ఘాటించారు. స్వదేశీ ఉత్పత్తుల తయారీ.. రక్షణ రంగం ఆధునికీకరణకే కాకుండా దేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి సైతం బాటలు వేస్తోందన్నారు.

## పరిషత్ పోరులో 51 వేల మందికిపైగా
# అభ్యర్థులు!

మొదటి తరువాయి

అవకాశముంది. ఎంపీటీసీ స్థానాలకు తెలుగుదేశం పార్టీ నుంచి 19,760 మంది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 17,726 మంది, జనసేన నుంచి 4,330 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. జెడ్పీటీసీ స్థానాలకు టీడీపీ నుంచి 1,693 మంది, వైసీపీ నుంచి 1,445 మంది, జనసేన నుంచి 587 మంది నామినేషన్లు ఆమోదం పొందాయి. మిగిలిన అభ్యర్థులు ఇతర పార్టీలు, స్వతంత్రులుగా ఉన్నారు. అయితే నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే తుది పోటీదారుల సంఖ్యపై స్పష్టత రానుంది. గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు ప్రధాన పార్టీలు ఎన్నికల వ్యూహాలకు పదును పెడుతున్నాయి. స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారానికి సిద్ధమవుతున్నాయి. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, సాగునీటి సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలు ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా నిలిచే అవకాశముంది. అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, స్థానిక రాజకీయ సమీకరణాలు కూడా ఫలితాలపై ప్రభావం చూపనున్నాయి. మరోవైపు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు నవంబర్ 1న పోలింగ్, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. అయితే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల తేదీలపై సుప్రీంకోర్టు తీర్పు కీలకంగా మారనుంది. న్యాయపరమైన అంశాలపై స్పష్టత వచ్చిన తర్వాత పరిషత్ ఎన్నికల తదుపరి షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశముంది. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల సంఘం అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

# మా ర్యాలీకి పబ్లిసిటీ చేస్తున్నందుకు థ్యాంక్స్'..



న్యూఢిల్లీ
కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న భారీ నిరసన ర్యాలీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ ర్యాలీకి ఇండియా కూటమి నాయకుల కంటే బీజేపీ, దాని మిత్రపక్షాల నేతలే ఎక్కువ ప్రచారం కల్పిస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ర్యాలీపై విమర్శలు చేస్తూ పరోక్షంగా ప్రచారం కల్పిస్తున్నందుకు అధికార కూటమి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఏడు రోజులు కూడా ఇదే ఉత్సాహాన్ని, అంకితభావాన్ని కొనసాగించాలని ఎద్దేవా చేశారు. రామ్‌లీలా మైదానం వరకు చేపట్టనున్న నిరసన ప్రదర్శన నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. నవంబర్ 1న నిర్వహించనున్న ర్యాలీకి సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్న నేపథ్యంలో బీజేపీ నేతల విమర్శలపై రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. తమ నిరసన కార్యక్రమానికి పెద్దఎత్తున ప్రచారం కల్పిస్తున్నందుకు బీజేపీ, దాని మిత్రపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపడుతున్న పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికార కూటమి నాయకులే సహకరిస్తున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. దేశంలో ఓటర్ల హక్కులను కాలరాసే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఓటర్ల జాబితాల నుంచి కోట్లాది మంది పేర్లను తొలగించారని, ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించారని విమర్శించారు. ప్రజల ఓట్లను దొంగిలిస్తున్నారని ఆరోపిస్తూ ఇటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకుంటున్నాయని తాము ఆరోపిస్తున్న అక్రమాలపై ప్రశ్నించిన వారిని అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు

# 2028లో మళ్లీ కేసీఆరే సీఎం..

మొదటి తరువాయి

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన మైనారిటీ సీనియర్ నాయకుడు జిబ్రాన్ షరీఫ్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చిందని, వాటి అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత రాహుల్ గాంధీపై ఉందని కేటీఆర్ అన్నారు. దేశమంతా తిరుగుతున్న రాహుల్ గాంధీకి తెలంగాణ గుర్తుకు రావడం లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో నిరుద్యోగ యువతను కలిసి ఉద్యోగాలపై హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని ఎంతవరకు నెరవేర్చిందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. మైనారిటీల సంక్షేమానికి రూ.4,000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ, ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఆసరా పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీస్తే సమాధానం చెప్పాల్సింది పోయి తిట్లు, అక్రమ కేసులతో బెదిరిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో వరుస వివాదాలు, అవినీతి ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ పెద్దల కుటుంబ సభ్యులకు సంబంధించిన భూముల వ్యవహారాలు, వ్యాపార ఒప్పందాలపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. సుమారు రూ.200 కోట్ల విలువైనదిగా చెబుతున్న ఐదు ఎకరాల భూమిని రూ.7 కోట్లకే తన తమ్ముడికి బహుమతిగా ఇచ్చారని ఆరోపించారు.

# సంపాదకీయం

## బియ్యం రేటులో రైతుకు దక్కిందెంత?!



సన్నబియ్యం ధర రూ.95 రూపాయలకు పెరిగింది.. నా వల్లే!' అని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పగా చెప్పుకొంటున్నారు. బియ్యం రేటు పెరగడం గొప్ప అనుకుంటే అలా పెరిగిన పుణ్యమంతా సీఎమ్మే మూటగట్టుకోనీ. కానీ ఆ బియ్యాన్ని పండించిన రైతన్నకు దక్కిన లాభమెంతో కూడా చెప్తే అన్నదాతలు పులకించిపోతరు కదా! పగలనకా, రాత్రనకా, ఎండనకా, వాననకా మట్టిలో మట్టయి పంట పండిస్తరు రైతులు. అప్పులు చేసి విత్తనాలు తెస్తరు, ఎరువుల కోసం ఎన్నో అవస్థలు పడుతరు, కూలీలకు పైసలియ్యలేక తిప్పలు పడుతరు. తీరా వడ్లు చేతికొస్తే కొనుగోలు కేంద్రాల దగ్గర పడిగాపులు కాస్తరు. తాలు పేరుతో కోతలు, తేమ పేరుతో కొర్రీలు.. రైతన్నకు మాత్రం కంటినిండా కన్నీళ్లు, జేబునిండా అప్పులే! మరి సన్నబియ్యం కేజీ రూ.95 అయితే ఆ పైసలతో రైతన్న ఇంట్లో గుమ్మీలు నింపుకొన్నడా? అదేం లేదు కదా! పండించేటోళ్లు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. మధ్యలో దళారులు మాత్రం కుర్చీల్లో కూసొని లాభాల పంటలు పంచుకుంటున్నారు. చెమటోడ్చినోళ్లకు చిల్లిగవ్వ దక్కుతలేదు. ఇదేనా రైతన్నకు దక్కుతున్న రాజభోగం? బ్రోకర్ల దోపిడీని సర్కారీ ఘనతగా చెప్పుకోవడం సీఎం తెలివితేటలు ఎంత గొప్పవో తెలియజేస్తున్నది.

**నీళ్ల ఆంధ్రకు.. నీతులు ప్రజలకు!**

రేవంత్ సర్కార్ తీరు చూస్తుంటే నవ్వాలో ఏడ్వాలో అర్థం కాని పరిస్థితి! లెక్కలు చూస్తేనేమో వర్షపాతం లోటు తెలంగాణాలో తక్కువే కనిపిస్తున్నది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో లోటు ఎక్కువే ఉన్నా, అక్కడ రైతుల హాహాకారాలు ఇంతగా లేవు! మరి మన తెలంగాణలనే కరెంటు కష్టాలు, నీళ్ల గోసలు ఎందుకని ఆలోచించి.. ఇదంతా ప్రకృతి మహిమే అనుకుంటే పొరపాటే సుమీ! ఏడాది ముందునుంచే ఎల్ నినో ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరికలు వస్తున్నయ్. అయినా సర్కార్‌కు చెవికెక్కినట్టు లేదు. నీళ్లు ఆంధ్రాకు తరలిపోయినయి. ఇదంతా చోద్యం చూసిన పాలకులు పంప్ హౌస్‌లతో నీటిని ఎత్తాలని ఆలోచించలేదు. అప్పుడు నీళ్లను ఒడిసిపట్టే తెలివి లేకపాయె.. ఇప్పుడు మాత్రం చుక్క నీళ్ల కోసం జనం అల్లాడుతుంటే ఉపదేశాలు మొదలుపెట్టింద్రు ముఖ్యమంత్రివర్యులవారు! కనీసం నెల రోజులు నీళ్లు ఎత్తిపోయలేక, పదినెలల కరువును ప్రజల నెత్తిన రుద్దుతుంద్రు! చేతులు కాలినంక ఆకులు పట్టుకున్నట్టు, సీజన్ అంతా గడిచిపోయాక సర్కార్ నిద్ర లేచినట్టు నటిస్తున్నది. ఇప్పుడు తాగునీళ్లు లేవంటరు, సాగునీళ్లు ఇవ్వలేమంటరు, కరెంటు పొదుపుగా వాడాలంటరు. ఏసీలు వేయొద్దంటరు, లైట్లు వెలిగించొద్దంటరు! ప్రకృతి విపత్తుల్ని ముందే పసిగట్టి సిద్ధపడటం పాలకుల బాధ్యత కాదా? నీళ్లను ఇడిసిపెట్టి, ఇప్పుడు ప్రజలకు నీతులు చెప్పడం ఏం పాలనయ్యా బాబూ? బాబు చెప్పినట్టు నడిచే పాలననా?

**సర్వీస్ నుంచి దిగిపోతే గతేంటి?**

తెలంగాణలో కాంగ్రెస్ పాలన చూస్తుంటే ఓ సామెత గుర్తుకొస్తున్నది. ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీల మోత! డ్యూటీలో ఉండే పోలీసులకే వైద్యం అందించలేని దుస్థితి ఉంటే, ఇక సామాన్యుల ఆరోగ్యానికి దిక్కెవరు మహాశయా? సర్వీసులో ఉన్న హెడ్ కానిస్టేబుల్ దేవసోత్ శంకర్ నాయక్ అనారోగ్యంతో సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతుంటే, ఈహెచ్‌ఎస్ సౌకర్యం సమయానికి అందకపోవడం ఎంత దారుణం! అడ్వాన్స్ డబ్బులు కట్టలేదని దవాఖానలో వైద్యం కోసం ఇబ్బందులు పడాల్సిన దుస్థితి. చివరికి తోటి ఉద్యోగులే చందాలు వేసుకొని చికిత్స చేయించాల్సి వచ్చిందంటే, ప్రభుత్వ ఆరోగ్య భద్రత ఏ మూలకు పోయినట్టో! బహుశా రేవంత్‌కు తెలుసేమో! కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు అమలులో ఉన్న పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఉద్యోగుల సంక్షేమం కాగితాల మీద బాగుంటే సరిపోదు కదా! ఆపదొచ్చినప్పుడు ఆదుకోవాలె గానీ, ఫైళ్లను ఒక టేబుల్ నుంచి ఇంకో టేబుల్‌కు తిప్పుకొంటూ రోగి ప్రాణాలతో దోబూచులాడుడేంది? బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన మాట ప్రకారం, ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించడం మానవత్వానికి నిదర్శనం. బీఆర్‌ఎస్ బృందం దవాఖానను సందర్శించిన తర్వాతే ఈహెచ్‌ఎస్ అధికారులు మేల్కొన్నారు. ప్రభుత్వం రాజకీయ కక్షలతో కేసులు, అరెస్టుల మీద చూపించే శ్రద్ధలో సగమైనా ఉద్యోగుల ఆరోగ్య భద్రత మీద పెడితే బాగుంటది కదా! సర్వీసులో ఉన్న పోలీసుకే ఈ గతి పడితే, రిటైరైన ఉద్యోగుల పరిస్థితి ఇంకెంత దయనీయమో!

**ఫామ్ హౌస్ ఫైలుతోనే టైమ్ పాస్!**

రేవంత్ పాలనలో కామెడీకి కొదువ లేదని మల్లమల్ల రుజువైతున్నది. మొన్నటిదాకా కేసీఆర్‌ది వెయ్యెకరాల ఫామ్ హౌస్ అంటూ గాలి మాటలతో గోల చేసినోళ్లే, ఇప్పుడు ఆ ఆరోపణలను నిజమని నిరూపించలేక నానా తంటాలు పడి చివరాఖరికి అరవై ఏడెకరాల దగ్గరికి వచ్చింద్రు. అందులోనూ ఎలాంటి ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు లేవని తేలింది. ఇప్పుడు కాంగ్రెసోళ్లకు మాటలు రావడంలేదు. ఈ ముచ్చట కూడా ఎక్కడా మాట్లాడే ధైర్యం చేస్తలేరు. అడ్డమైనోళ్లంతా ఆరోపణలు చేస్తరు, కానీ ఆధారాలు చూపిస్తేనే కదా నిలబడేది. గాలిలో మేడలు కట్టినోళ్లు, ఇప్పుడు ఆ మేడలకు పునాదులు వెతుకుతున్నరు. ఇక కొండపోచమ్మ సాగర్ కట్టిందే కేసీఆర్ ఫామ్ హౌస్ బావి నింపడానికి అన్నట్టు మాట్లాడితే, పిట్టలదొరలు కూడా పగలబడి నవ్వుతరు. లక్షల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే ప్రాజెక్టును పట్టుకొని, ఎవరో ఒకరి బావి కోసమే కట్టినట్టుగా కట్టుకథలు అల్లితే ఎవరు నమ్ముతరు? ప్రాజెక్టుల ప్రయోజనాలపై చర్చించాల్సింది పోయి, బావుల చుట్టూ రాజకీయాలు తిప్పడం కూడా ఓ పాలననేనా?! కాంగ్రెస్ నేతలు ఇంకో నాలుగు రోజులు టైమ్‌పాస్ చేయడం కోసం కొత్త డ్రామా షురూ చేసినా చేస్తరేమో! 'రామగుండం నుంచి కరెంట్ లైన్లు వేసింది కేసీఆర్ ఫామ్ హౌస్ కోసమే.. విచారణ జరుపుతాం' అని మరో పొంగులేటి బ్రాండ్ బాంబు పేల్చినా పేల్చుతారేమో! ప్రజలకు కావాల్సింది కరెంటు, నీళ్లు, రైతులకు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు. కానీ పాలకుల దృష్టంతా పనికిరాని ఆరోపణల కోసమే అయితే ఎట్లా? తప్పులు జరిగినట్టు చెప్పి ఆధారాలు చూపకపోతే, జనం ఛీకొడుతారనే ఆలోచనైనా ఉండకపోతే ఎట్ల? కాంగ్రెసోళ్లకు అంత సోయి ఉంటే మన బతుకులు ఇట్లెందుకు ఉంటుండే కనీ!

# రసవత్తరం.. చిట్వేలి కూటమి రాజకీయం!

- ఎంపీపీ పీఠంకోసం కిరికిరి
- ఒకే సామాజికవర్గంలో పోటాపోటీ..
- నగిరిపాడు లో ఉత్కంఠ
- జడ్పీటీసీ బరిలో 12 మంది..
- ప్రధాన పార్టీల మధ్య పోటీ
- టీడీపీ, వైసీపీ నుంచి ఐదుగురేసి.. జనసేన నుంచి ఇద్దరు



చిట్వేలి (డ్రీమ్ టైమ్స్), అక్టోబరు 25:

**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం.. రైల్వేకోడూరు నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ప్రాతినిధ్యం.. కానీ చిట్వేలి మండల పరిషత్ ఎన్నికల విషయానికి వచ్చేసరికి కూటమి పార్టీల మధ్య పదవుల పంపకం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. ఎంపీపీ పీఠం ఎవరికి దక్కాలి? జడ్పీటీసీ అభ్యర్థిగా ఎవరిని నిలపాలి? మిత్రపక్షాల మధ్య సీట్ల సర్దుబాటు ఎలా ఉండాలి? అన్న అంశాల చుట్టూ మండల రాజకీయాలు తిరుగుతున్నాయి. మరోవైపు జడ్పీటీసీ స్థానానికి టీడీపీ, వైసీపీ నుంచి ఐదుగురేసి, జనసేన నుంచి ఇద్దరు నామినేషన్లు ఆమోదం పొందడంతో ఎన్నికల పోరు మరో ఆసక్తికర మలుపు తీసుకుంది. ఎంపీపీ పదవి కోసం కూటమిలో సాగుతున్న అంతర్గత చర్చలు, జడ్పీటీసీ బరిలో కనిపిస్తున్న అభ్యర్థుల సంఖ్య చిట్వేలి రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరతీశాయి**

### ఎంపీపీ పీఠంపై కూటమిలో కిరికిరి!

రైల్వేకోడూరు నియోజకవర్గంలో కూటమి రాజకీయాలకు నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి నాయకత్వం కీలకంగా ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి భాగస్వామ్య పక్షాలకు పదవుల పంపకం, పరస్పర అవగాహనతో అభ్యర్థుల ఎంపిక జరగాల్సి ఉండగా.. చిట్వేలి మండలంలో మాత్రం ఎంపీపీ, జడ్పీటీసీ పదవుల విషయంలో టీడీపీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. జనసేనకు కూడా పొత్తు ధర్మంలో భాగంగా ప్రాతినిధ్యం కల్పించాలన్న అంశం ఒకవైపు ఉండగా, కీలక పదవులను టీడీపీ తనకే దక్కించుకోవాలన్న పట్టుదల మరోవైపు కనిపిస్తున్నట్లు సమాచారం.

రూపానందరెడ్డి ప్రధాన అనుచరుడిగా పేరున్న గుత్తి నరసింహులుకు ఎంపీపీ పదవి కేటాయించాలన్న ఆలోచనకు మండలంలోని ఒక సామాజికవర్గ నాయకుల నుంచి అభ్యంతరాలు ఎదురైనట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలతో ఒక దశలో సర్దుబాట్లు తప్పలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చివరకు ఎంపీపీ, జడ్పీటీసీ పదవుల విషయంలో వేర్వేరు పేర్లతో సమీకరణాన్ని రూపొందించినట్లు సమాచారం.

### నగిరిపాడులో ఇద్దరు.. ఎంపీపీ ఆశావహుల్లో పోటీ!

ఎంపీపీ పీఠాన్ని దృష్టిలో పెట్టుకొని టీడీపీ రాష్ట్ర నాయకుడు, రైల్వేకోడూరు నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కస్తూరి విశ్వనాథ నాయుడు సతీమణి డాక్టర్ కస్తూరి వరలక్ష్మిని నగిరిపాడు ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలోకి దించారు. అదే గ్రామం నుంచి టీడీపీ రెబల్ అభ్యర్థిగా బుంగటావుల భాస్కర్ సతీమణి కూడా నామినేషన్ దాఖలు చేయడంతో అక్కడి పోటీ ఆసక్తికరంగా మారింది. ఒకే సామాజికవర్గానికి చెందిన అభ్యర్థులు ఒకే ఎంపీటీసీ స్థానంపై దృష్టి సారించడంతో పార్టీ అంతర్గత సమన్వయం ప్రశ్నార్థకంగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో కే. అగ్రహారం నుంచి ప్రముఖ కాంట్రాక్టర్ పాటూరు శ్రీనివాసులు రెడ్డి సతీమణి పాటూరి సుమలతను కూడా రంగంలోకి దించినట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. నగిరిపాడులో ఒకే సామాజిక వర్గం నుంచి ఆసక్తికర పోటీ నెలకొనడంతో ఒకవేళ అక్కడి నుంచి ఎంపీపీ పదవి చేజారితే దానిని టిడిపికి చెందిన కేఎస్ అగ్రహారం నుంచి పోటీ చేస్తున్న సుమలత ప్రత్యామ్నాయం అవుతుందని రాజకీయ వర్గాల అభిప్రాయం. దీంతో ఎంపీపీ పీఠానికి సంబంధించి అభ్యర్థుల ఎంపిక కేవలం పార్టీ నిర్ణయానికే పరిమితం కాకుండా, స్థానిక నాయకుల బలాబలాలు, సామాజిక సమీకరణాలు, పరస్పర అంగీకారాల చుట్టూ తిరుగుతున్నట్లు కనిపిస్తోంది.

### జడ్పీటీసీ బరిలో 12 మంది..

చిట్వేలి జడ్పీటీసీ స్థానానికి దాఖలైన నామినేషన్ల పరిశీలన అనంతరం 12 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు తిరుపతి జిల్లా పరిషత్ రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. వీటిలో టీడీపీ నుంచి ఐదుగురు, వైసీపీ నుంచి ఐదుగురు, జనసేన నుంచి ఇద్దరు ఉన్నారు. ఈ సంఖ్యలు నామినేషన్ల పరిశీలన దశకు సంబంధించినవే కాగా, ఉపసంహరణల అనంతరం తుది పోటీలో ఎంతమంది మిగులుతారన్నది కీలకం కానుంది.

టీడీపీ తరఫున బుంగటావుల భాస్కర్, కట్టా శ్రీనివాసులు, గుత్తి నరసింహులు, మురగాని వెంకట రమణ, నాయిని బాలాజీ నామినేషన్లు ఆమోదం పొందినట్లు అధికారిక జాబితాలో నమోదైంది. వైసీపీ నుంచి చంద్రమోహన్‌రెడ్డి లేబాకు, సురేంద్ర కుమార్‌రెడ్డి లేబాకు, యలకచెర్ల శివప్రసాద్‌రెడ్డి, ఎలగచెర్ల నవీన్ కుమార్‌రెడ్డి, డి. ప్రదీప్ కుమార్‌రెడ్డి నామినేషన్లు ఆమోదం పొందాయి. జనసేన తరఫున ఆనాల సునీల్ కుమార్, నానబాల నాగార్జున బరిలో ఉన్నారు.

### ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వైసీపీ అభ్యర్థులు

జడ్పీటీసీ నామినేషన్లలో దేవమాచపల్లికి చెందిన చంద్రమోహన్‌రెడ్డి లేబాకు, సురేంద్ర కుమార్‌రెడ్డి లేబాకు ఇద్దరూ వైసీపీ తరఫున నామినేషన్లు దాఖలు చేయడం ప్రత్యేకంగా కనిపిస్తోంది. అధికారిక జాబితాలో వీరిద్దరి తండ్రి పేరు వెంకట సుబ్బారెడ్డి లేబాకుగా నమోదైంది. అదేవిధంగా నగిరిపాడుకు చెందిన యలకచెర్ల శివప్రసాద్‌రెడ్డి, ఎలగచెర్ల నవీన్ కుమార్‌రెడ్డి ఇద్దరి తండ్రి పేరు రంగారెడ్డిగా నమోదైంది. దీంతో ఒకే కుటుంబానికి చెందినవారిగా కనిపిస్తున్న అభ్యర్థుల నామినేషన్లపై ఆసక్తి నెలకొంది. అయితే వీరి పరస్పర సంబంధం, నామినేషన్ల వెనుక ఉన్న నేపథ్యం అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది.

### పార్టీల సమన్వయమే అసలు పరీక్ష!

చిట్వేలి మండలంలో ఎంపీపీ పీఠం కోసం కూటమిలో సాగుతున్న అంతర్గత పోటీ, జడ్పీటీసీ స్థానానికి మూడు ప్రధాన పార్టీల నుంచి వచ్చిన నామినేషన్లు ఎన్నికల రాజకీయాన్ని మరింత ఆసక్తికరంగా మార్చాయి. ఒకవైపు టీడీపీలో పదవుల పంపకం, రెబల్ అభ్యర్థుల అంశం చర్చకు వస్తుండగా, మరోవైపు వైసీపీ అభ్యర్థుల సంఖ్య, కుటుంబ సంబంధాలున్నట్లు కనిపిస్తున్న నామినేషన్లు స్థానిక రాజకీయ చర్చకు కారణమవుతున్నాయి. అయితే నామినేషన్ల సంఖ్య ఒక్కటే పార్టీల బలాబలాలను నిర్ధారించదు. ఉపసంహరణల అనంతరం తుది అభ్యర్థుల జాబితా, కూటమి భాగస్వాముల మధ్య సర్దుబాట్లు, స్థానిక నాయకుల నిర్ణయాలు, గ్రామస్థాయి మద్దతు ఎన్నికల స్వరూపాన్ని నిర్ణయించనున్నాయి. ఎంపీపీ పీఠం విషయంలో కూటమి ఏకాభిప్రాయానికి వస్తుందా? జడ్పీటీసీ పోరులో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఎలా నిలబెట్టుకుంటాయి? అన్నది చిట్వేలి మండల రాజకీయాల్లో తదుపరి కీలక పరిణామంగా మారనుంది.

# ఎన్నికల బరిలో నిలిచిన.. గుంతకల్లు మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థినులు వీరే..!



గుంతకల్లు కూటమి పార్టీల తరఫున మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థిని రామ గౌని యశోద గౌడ్



నంగినేని వెంకటలక్ష్మి గుంతకల్లు వైసిపి మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థిని



ఫరిదాబీ గుంతకల్లు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థిని



మద్దెల జామిని గుంతకల్లు బీఎస్పీ మున్సిపల్ చైర్పర్సన్ అభ్యర్థిని

గుంతకల్లు, అక్టోబరు 25(డ్రీమ్ టైమ్స్):

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం విడుదల చేసిన తుది జాబితాలో గుంతకల్లు సంబంధించి వివిధ పార్టీలకు చెందిన మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థులు ఖరారయ్యారు. ఇందులో టిడిపి, బిజెపి, జనసేన పార్టీలు బలపరుస్తున్న కూటమి అభ్యర్థినిగా దివంగత, మాజీ ఎమ్మెల్యే సాయినాథ్ గౌడ్ కోడలు రామ గౌని యశోద నిలిచారు. అలాగే దివంగత, మాజీ ఎమ్మెల్యే గాదిలింగప్ప సతీమణి నంగినేని వెంకటలక్ష్మి వైసీపీ తరఫున మున్సిపల్ ఎన్నికల్లో బరిలో నిలిచారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరఫున పర్వీన్ పోటీలో ఉంటున్నారు. అలాగే బహుజన సమాజ్ పార్టీ తర పున మద్దెల జామిని పోటీ చేస్తున్నారు. అంతేకాకుండా గుంతకల్లు మున్సిపల్ కౌన్సిలర్ స్థానాలకు టిడిపి, బిజెపి, జనసేన, కాంగ్రెస్, బి ఎస్ పి తదితర పార్టీలకు చెందిన అభ్యర్థులు మొత్తం 189 మంది ఎన్నికల బరిలో నిలిచారు.

## 4వ వార్డులో వైసీపీ అభ్యర్థి పురందర్ కుమార్ ఇంటింటి సుడిగాలి ప్రచారం.



**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
నంద్యాల పట్టణంలోని 4వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పురందర్ కుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. వార్డులోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక ఓటర్లను కలుసుకుని, ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

**వార్డు సమస్యలపై ప్రస్తావన.**
ప్రచారంలో భాగంగా స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న పురందర్ కుమార్, వార్డులోని మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, విద్యుత్ సమస్యలు వంటి అంశాలు వార్డు అభివృద్ధిలో ప్రాధాన్యత కలిగినవని పేర్కొన్నారు.

**గతంలో కంటే మెరుగైన సేవలు అందిస్తానని వెల్లడి.**
మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి (రవి అన్న) ఆశీస్సులతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు పురందర్ కుమార్ తెలిపారు. తనకు అవకాశం కల్పిస్తే గతంలో కంటే మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, స్థానిక సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం, తన ప్రాధాన్యతలని వెల్లడించారు.

**అభివృద్ధి అంశాలపై దృష్టి**
4వ వార్డులో మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాల కోసం కృషి చేస్తానని పురందర్ కుమార్ తెలిపారు. ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని, వైసీపీ ఎన్నికల గుర్తు అయిన ఫ్యాన్‌కు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో వార్డు అభివృద్ధి, స్థానిక సమస్యలు, భవిష్యత్తులో చేపట్టాలనుకుంటున్న కార్యక్రమాలు ప్రధాన అంశాలుగా ప్రస్తావనకు వస్తున్నాయి.

## 51వ వార్డులో ఎన్నికలు యథాతథం.

**-ఏకగ్రీవ ఎన్నిక రద్దు చేసిన ఎన్నికల అధికారి మోహన్‌రావు.**



**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
నంద్యాల స్థానిక మున్సిపాలిటీలోని 51వ వార్డులో ఏకగ్రీవ ఎన్నికను రద్దు చేసినట్లు ఎన్నికల అధికారి మోహన్‌రావు తెలిపారు. అభ్యర్థి సమర్పించిన పత్రాలు నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో ఏకగ్రీవంగా ప్రకటించిన నిర్ణయాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో 51వ వార్డులో ఎన్నికలు యథావిధిగా నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.

## మార్కాపురం జడ్పీ సీఈఓగా జోసఫ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



**మార్కాపురం,జిల్లా బ్యూరో, డ్రీమ్ టైమ్స్**
మార్కాపురం జిల్లా పరిషత్ నూతన ముఖ్య కార్య నిర్వహణాధికారిగా (సీఈఓ) జి. జోసఫ్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీతను మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యమిస్తానని జోసఫ్ కుమార్ పేర్కొన్నారు.

## తిమ్మాయపల్లి రెవెన్యూ పరిధిలో పేకాట స్థావరంపై దాడి - ఐదుగురు అరెస్ట్




**నాగారం, అక్టోబర్ 25:-డ్రీమ్ టైమ్స్**
తిమ్మాయపల్లి రెవెన్యూ పరిధిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఆదివారం పేకాట స్థావరంపై ఎస్ఐ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడి పేకాట రాయుళ్ళను పట్టుకున్నారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని. వారి వద్ద నుండి నగదు రూ. 35,000/-, 5 ద్విచక్ర వాహనాలు, 5 మొబైల్ ఫోన్లు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని పోలీసులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు కీసర ఎస్ హెచ్ఓ తెలిపారు.

# ప్రజలకు ఇచ్చిన మోసపు హామీలపై కూటమి సర్కార్‌ను నిలదీత





**-త్వరలోనే ప్రజా ఆగ్రహం చవిచూడక తప్పదన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి.**

**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
స్థానిక ఎన్నికలు వస్తేనే ప్రజలు గుర్తుకొస్తారా?! మాయమాటలతో మరోసారి ప్రజలను మోసం చేయడానికి కుట్రలు పన్నుతున్నారా? అవును ఇదో రాజకీయ ప్రకటన కాదు, ప్రజల గొంతుక చంద్రబాబు నాయుడు పాలనపై, ఆయన మోసపూరిత వైఖరిపై వైయస్సార్‌సీపీ శ్రేణులు సంధిస్తున్న తీవ్రమైన అగ్గిలాంటి ప్రశ్న ఇది! నంద్యాల పురపాలిక పోరు రోజురోజుకూ రసవత్తరంగా మారుతున్న వేళ మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ భాష, ఎస్ డి పి ఐ నాయకులు డేనియల్ పురం, సరస్వతి నగర్ సుద్దల పేటలో ప్రచార పర్వంలో అధికార పార్టీ వైఖరిపై నిప్పులు చెరిగారు. పట్టణ అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి హోరెత్తించిన ఆయన, కూటమి నేతల అవినీతి, అరాచకాలు, ప్రజా వ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని, నేడు కూటమి నాయకులు సాగిస్తున్న దుర్మార్గపు పాలనను ఏకిపారేశారు. నంద్యాల మున్సిపాలిటీని మళ్లీ ప్రగతి పథంలో నడిపించాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల మోసాలపై కూటమి సర్కార్‌ను శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నిలదీశారు.
త్వరలోనే ప్రజా ఆగ్రహం చవిచూడక తప్పదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని కీలక వార్డులలో ఆయన పర్యటించారు. చైర్మన్ అభ్యర్థి అమీర్ బాషాతో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 42వ వైసీపీ అభ్యర్థి షేక్ శంషాద్, 43 వ వార్డు వైసిపి అభ్యర్థి ఎం. లక్ష్మీదేవి, 15వ వార్డు వైసిపి అభ్యర్థి బైసాని రమేష్ బాబు, 16వ వార్డు వైసిపి అభ్యర్థి షేక్ ముంతాజ్ బేగం, వీరందరితో పాటు చైర్మన్ అభ్యర్థి అమీర్ బాషాను 'ఫ్యాన్' గుర్తుపై భారీ ఓట్లతో గెలిపించాలని నంద్యాలలో జోరుగా ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి మాట్లాడుతూ నాడు కరోనా కష్టకాలంలో ప్రజల ప్రాణాలు గాల్లో దీపంలా ఉంటే అప్పుడు వారిని కాపాడుకుంటూ, సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించిన ఘనత ఒక్క వైయస్సార్‌సీపీ ప్రభుత్వానిదే కానీ నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా ఒక్క కొత్త పింఛను కూడా ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో కూరుకుపోయిందని విమర్శించారు పేదవాడికి కొండంత భరోసాగా నిలిచిన 'ఆరోగ్యశ్రీ' పథకాన్ని నేడు అటకెక్కించిన ఘనత చంద్రబాబుదే అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలతో చెలగాటమాడుతున్న తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు. ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసేందుకు, కేవలం రాజకీయ లబ్ధి కోసం కులమతాల మధ్య చిచ్చులు పెట్టడమే ఈ ప్రభుత్వ నైజం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా పవిత్రమైన తిరుపతి లడ్డు ప్రసాదంపై కూడా అబద్ధపు ప్రచారాలు సృష్టించి, భక్తుల మనోభావాలను దెబ్బతీసిన నీచమైన రాజకీయాలు చంద్రబాబుకే చెల్లాయన్నారు. "కష్టకాలంలో ప్రజలను ఆదుకున్న చరిత్ర వైయస్సార్‌సీపీది అయితే అధికారం కోసం అబద్ధాలు, కుట్రలు, కులాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలు చంద్రబాబువి ప్రజల నెత్తిపై మోసాల భారం మోపుతున్న ఈ దౌర్భాగ్యపు పాలనకు ప్రజలే తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

# సైకిల్ జోరు.. ప్రచార హోరు.





**-43వ వార్డులో వెంకట లక్ష్మి ఇంటింటి ప్రచారం ముమ్మరం.**

**-కూటమి సంక్షేమ పథకాలే గెలుపు గుర్రాలు.**

**-30 ఏళ్ల తర్వాత బీసీలకు దక్కిన గుర్తింపు.. టీడీపీకే మా ఓటు అంటున్న వార్డు ప్రజలు.**

**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**
నంద్యాల పురపాలక సంఘం 43వ వార్డు ఎన్నికల సమరంలో తెలుగుదేశం పార్టీ విజయదుందుభి మోగించేందుకు దూసుకుపోతోంది. టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి డి. వెంకట లక్ష్మి, చైర్మన్ అభ్యర్థి డా. బాబన్ గెలుపే ఏకైక లక్ష్యంగా వార్డులో చేపట్టిన ఎన్నికల ప్రచారం సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. శ్రేణుల కేరింతలు, స్థానికుల అపూర్వ ఆదరణ నడుమ ప్రచారం జోరుగా సాగింది. వార్డు ఇన్‌చార్జ్ డి. మారుతి (ప్రసాద్ బాబు) సమన్వయంతో అభ్యర్థి డి. వెంకట లక్ష్మి నాయకులతో కలిసి ప్రతి గడపనూ సందర్శించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిస్తూ, సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అభ్యర్థి డి. వెంకట లక్ష్మి మాట్లాడుతూ.. "గత 30 ఏళ్లుగా ఈ వార్డులో ఏ రాజకీయ పార్టీ కూడా బీసీలను గుర్తించి అవకాశం ఇవ్వలేదు. కానీ, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసే తెలుగుదేశం పార్టీ నన్ను గుర్తించి కౌన్సిలర్ అభ్యర్థిగా నిలబెట్టింది. ప్రజా సంక్షేమం, వార్డు సర్వతోముఖాభివృద్ధే నా ధ్యేయం. మీ అమూల్యమైన ఓటుతో ఆశీర్వదించండి" అని పిలుపునిచ్చారు. స్థానిక మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మార్గదర్శకత్వంలో వార్డులో తాగునీరు, డ్రైనేజీ, రహదారుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు జిల్లెళ్ల శ్రీరాములు, నగర డోనా సుధీర్, సద్దాం, వాసు, ఖలీల్, శేఖర్ రెడ్డి, సునీల్ కుమార్, చంటి, శివశంకర్, శ్రీనివాసులు, పుల్లయ్య, దాసు, నూర్ భాష తమిళ్లు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నవంబరు 1న జరిగే పోలింగ్‌లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి, వెంకట లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని శ్రేణులు ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో మహిళలు, స్థానికులు హారతులు పడుతూ పూర్తి మద్దతు ప్రకటించారు.

# నంద్యాల 51వ వార్డులో ఎన్నికల వివాదం.. ఏకగ్రీవంపై ఉత్కంఠ!

**-నామినేషన్ ఉపసంహరణ పత్రంపై అభ్యంతరాలు.. ఇద్దరు అభ్యర్థులతో ఫారం-7 విడుదల**

**-అవ్వరి నాగమణి అభ్యంతరాలతో రాజకీయంగా కీలక పరిణామం**

**నంద్యాల క్రైమ్ । డ్రీమ్ టైమ్స్ అక్టోబర్ 25, 2026.**
నంద్యాల :నంద్యాల మున్సిపాలిటీలోని 51వ వార్డు ఎన్నికల వ్యవహారం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. తొలుత టీడీపీ అభ్యర్థిని ఏకగ్రీవంగా ప్రకటించినట్లు ప్రచారం జరగడం, అనంతరం ఆ నిర్ణయంపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఈ వార్డు ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. వైసీపీ కౌన్సిలర్ అభ్యర్థి అవ్వరి నాగమణి అభ్యంతరాలు, ఆ పార్టీ నియోజకవర్గ లీగల్ టీం చేసిన ప్రయత్నాలు ఈ వ్యవహారంలో ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



పోటీచేయు అభ్యర్థుల జాబితా (LIST OF CONTESTING CANDIDATES)
నంద్యాల మునిసిపాలిటీ ఛైర్‌పర్సన్ స్థానానికి (లేదా) నంద్యాల మునిసిపాలిటీ యొక్క 51 వ వార్డు సభ్యుని స్థానానికి జరుగు ఎన్నిక

| క్రమ సంఖ్య (SL. No.) | అభ్యర్థి పేరు (Name of Candidate) | లింగం (Sex) | అభ్యర్థి చిరునామా (Address of candidate) | రాజకీయ పార్టీ అనుబంధం (ఉంటే) (Party Affiliation, if any) | అభ్యర్థికి కేటాయించిన విశిష్ట గుర్తు (Distinctive symbol assigned) |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 1 | అవ్వారి నాగమణి | స్త్రీ | 25/427-10A-4, సంజీవ నగర్, నంద్యాల | యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ | |
| 2 | విజయ లాటికొండ | స్త్రీ | 25/450-2A-1988, వైఎస్ఆర్ నగర్, నంద్యాల | తెలుగు దేశం పార్టీ | |

గమనిక: ప్రత్యేకంగా నెలకొల్పబడిన పోలింగ్ కేంద్రంలో 1-11-2026 తేదిన (లేదా తేదిలలో) ఉదయం 7:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల మధ్య పోలింగ్ నిర్వహించబడుతుంది.

ఎన్నికల అధికారి
Election Officer,
Wards (49 to 52)
Nandyal Municipality




**ఫారం-7లో ఇద్దరు అభ్యర్థుల వివరాలు**
ఎన్నికల అధికారికి సంబంధించిన ఫారం-7లో 51వ వార్డుకు పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థుల పేర్లు, వారి పార్టీ వివరాలు, ఎన్నికల గుర్తులు నమోదై ఉన్నాయి. ఈ పత్రంలో అభ్యర్థుల వివరాలు ఉండటం ఎన్నికల ప్రక్రియపై ఆసక్తిని పెంచింది. అయితే ఈ పత్రం ఒక్కటే ఏకగ్రీవ ప్రకటన రద్దయిందని నిర్ధారించదు.

**నామినేషన్ ఉపసంహరణ పత్రంపై వివాదం**
51వ వార్డులో నామినేషన్ ఉపసంహరణ పత్రంపై సంతకం ఫోర్జరీ జరిగిందనే ఆరోపణలు తెరపైకి వచ్చినట్లు సమాచారం. ఈ అంశంపై అవ్వరి నాగమణి అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పాటు, వైసీపీ లీగల్ టీం ఎన్నికల నిబంధనలు, సంబంధిత పత్రాల అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే సంతకం ఫోర్జరీ జరిగిందనే ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

**ఏకగ్రీవ ప్రకటనపై స్పష్టత ఎప్పుడు?**
ఒకసారి ఏకగ్రీవంగా ప్రకటించిన అభ్యర్థి విషయంలో నిర్ణయం మారిందనే ప్రచారం స్థానికంగా చర్చకు దారితీసింది. అయితే ఏకగ్రీవ ప్రకటన రద్దుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు, ఎన్నికల అధికారి తుది నిర్ణయంపై స్పష్టమైన సమాచారం అందుబాటులో లేదు. దీంతో 51వ వార్డులో ఎన్నికల ప్రక్రియ ఏ దిశగా సాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

**ఎన్నికల పారదర్శకతపై చర్చ**
నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల అర్హత, ఎన్నికల నిబంధనల అమలు వంటి అంశాలు స్థానిక ఎన్నికల్లో కీలకమైనవి. 51వ వార్డు వ్యవహారంలో సంబంధిత పత్రాలు, అధికారుల అధికారిక ప్రకటనలు వెలుగులోకి వస్తేనే వివాదానికి సంబంధించిన పూర్తి వాస్తవాలు స్పష్టమవుతాయి. మొత్తంగా, నంద్యాల మున్సిపాలిటీలోని 51వ వార్డు ఎన్నికల వ్యవహారం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఏకగ్రీవ ప్రకటనపై నెలకొన్న వివాదానికి ఎన్నికల అధికారులు ఎలాంటి స్పష్టత ఇస్తారన్నది ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# అభివృద్ధి, సేవా దృక్పథం ఉన్న వారికే ఓటర్ల మద్దతు -మంత్రి ఎన్ఎండి ఫరూక్.





**-ప్రత్యర్థి నేతలు ఈస్ట్ ఇండియా కంపెనీ లాంటివారు. వచ్చి పబ్బం గడుపుకొని వెళ్లిపోతారు. ఖండే శ్యామ్ సుందర్ లాల్ ఫైర్.**

**-సంతకు వచ్చి పోయే ఈస్ట్ ఇండియా కంపెనీ తరహా పాలకులకు ఓటుతో బుద్ధి చెప్పండి. ఖండే శ్యామ్ సుందర్ లాల్ పిలుపు.**

నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు బాలాజీ కాంప్లెక్స్ వద్ద తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఖండే శ్యామ్ సుందర్ లాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏపీ న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, నంద్యాల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ బాబన్, యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, ఎన్ఎండి ఫిరోజ్, నంద్యాల బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నంద్యాల పట్టణ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు . గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశామని తెలిపారు .

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేసే అభ్యర్థులనే ప్రజలు ఆదరించాలని, 13వ వార్డు టీడీపీ అభ్యర్థి ఖండే శ్యామ్ సుందర్ లాల్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ బాబన్, ఇతర కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఆయన వార్డు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా 13వ వార్డు టీడీపీ అభ్యర్థి ఖండే శ్యామ్ సుందర్ లాల్ మాట్లాడుతూ గతంలో నిధులు ఇవ్వకపోయినా కౌన్సిల్‌లో పోరాడి సుమారు రూ. 1.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులను వార్డులో చేపట్టామని తెలిపారు. మంత్రి ఫరూక్ సహకారంతో మరో రూ. కోటి అభివృద్ధి పనులకు ఆమోదం లభించిందని తెలిపారు . గత 15 ఏళ్లుగా ఉచిత వైద్య శిబిరాలు, కంటి అద్దాల పంపిణీ, దివ్యాంగులకు అవయవాల అమరిక, పేదల వివాహాలకు సాయం వంటి పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నామని గుర్తుచేశారు. 15వ వార్డు కూటమి అభ్యర్థి వేణు, తాను ప్రజాసేవలోనే ఉంటామని, కరోనా కష్టకాలంలో నిత్యావసర సరుకులు, పారిశుద్ధ్య కార్మికులు, పోలీసులకు భోజనాలు అందించిన ఘనత తమదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అడ్డదారులు తొక్కుతూ, స్థానికేతరులను బరిలోకి దింపుతూ ప్రత్యర్థులు ఆడుతున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. వ్యాపారాలు, స్వార్థ రాజకీయాల కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం పనిచేసే వారినే ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. ఆర్యవైశ్య సంఘం మరియు ఆర్యవైశ్యులంతా అభివృద్ధికి, నిబద్ధతకు అండగా ఉంటూ తమకు సంపూర్ణ మద్దతు ప్రకటించారని తెలిపారు. నంద్యాలలోని 52 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించి సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు కానుకగా అందిస్తామని అన్నారు .ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి బింగుమళ్ళ శ్యామ్ సుందర్ గుప్త, ఆనంద్ గురూజీ, మహానందీశ్వర స్వామి దేవస్థానం చైర్మెన్ బోయ రామకృష్ణ, కాలికాంబ దేవస్థానం చైర్మెన్ బింగుమళ్ళ సుబ్బలక్ష్మయ్య, 15వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థి పబ్బతి వేణుగోపాల్, జిల్లెల్ల శ్రీరాములు , డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ అధ్యక్షుడు దుద్దెల సురేష్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ, సెగు శ్రీనివాసులు, ఉప్పరి సురేష్ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పెద్ద ఆర్యవైశ్యులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 15వ వార్డులో కమలం గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి బాట వేయాలి.



**నంద్యాల డ్రీమ్ టైమ్స్ జిల్లా స్టాపర్.**

స్థానిక ఎన్నికల్లో 15వ వార్డులో ప్రాంతం ప్రజలు తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి బిజెపి అభ్యర్థి పబ్బతి వేణుగోపాల్ కమలం గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి బాటలు వేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పిలుపునిచ్చారు. ఆదివారం 15వ వార్డులోని పబ్బతి వేణుగోపాల్ స్వగృహం నుండి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు శ్రీశైలం దేవస్థానం సభ్యుడు బిజెపి సీనియర్ నాయకులు మేడా మురళీధర్ బిజెపి నాయకులు పసుపుల రవికుమార్ కసెట్టి చంద్ర చంద్రశేఖర్ తెలుగుదేశం జనసేన నాయకులు తరలి రాగా బిజెపి అభ్యర్థి పబ్బతి వేణుగోపాల్ సతీమణి అడ్వకేట్ గోంట్ల అపర్ణతో సరస్వతి నగర్ ప్రాంతంలో పర్యటించారు . ఈ సందర్భంగా అభివృద్ధి మాట్లాడుతూ పి ఏ వి గ్రూప్ స్థాపించి ఎంతోమందికి నంద్యాలలో ఉపాధినిస్తూ పబ్బతి వేణుగోపాల్ సేవలందిస్తున్నారని అన్నారు .15 వార్డులో పద్ధతి వేణుగోపాల్ వంటి మంచి అభ్యర్థిని పారిశ్రామికవేత్తను వార్డు ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. శ్రీశైలం దేవస్థానం సభ్యుడు బిజెపి సీనియర్ లీడర్ మేడ మురళీధర్ మాట్లాడుతూ పబ్బతి వేణుగోపాల్ పట్టణంలో తన సొంత డబ్బుతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినటువంటి వ్యక్తి అని అన్నారు. 15 వ వార్డు ప్రజలు ఇటువంటి మంచి మనిషికి గుర్తు కమలానికి ఓటు వేసి ఆదరించి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

## శ్రీశైలంలో వైభవంగా స్వామిఅమ్మవార్ల పల్లకీ ఉత్సవం







**తేదీ: 25.10.2026 । డ్రీమ్ టైమ్స్**

శ్రీశైలం: శ్రీశైల క్షేత్రంలో ఆదివారం పౌర్ణమి ఘడియలు ఉండటంతో శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు పల్లకీ ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం, పౌర్ణమి, మూలా నక్షత్రం రోజులలో ఈ పల్లకీ ఉత్సవాన్ని ప్రభుత్వ సేవగా నిర్వహిస్తున్నారు. ఉత్సవంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను నిర్వహించారు. ఆ తర్వాత శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో వేంచేపు చేయించి, శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలను నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

## శ్రీశైలంలో క్యూలైన్లు, అన్నప్రసాద వితరణ, లడ్డూ కౌంటర్లను పరిశీలించిన ధర్మకర్తల మండలి అధ్యక్షులు

**తేదీ: 25.10.2026 । డ్రీమ్ టైమ్స్ తెలుగు**

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు ఆదివారం ఆలయంలోని దర్శన క్యూలైన్లు, అన్నప్రసాద వితరణ భవనం, లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముందుగా దర్శన క్యూలైన్లు, కంపార్టుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, అవసరమైన చోట ఫ్లోరింగ్ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. భక్తులతో నేరుగా మాట్లాడి దర్శన ఏర్పాట్లు, మంచినీటి సరఫరా, ప్రసాద వితరణ, పారిశుద్ధ్య నిర్వహణపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రద్దీ సమయంలో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. క్యూలైన్లలో తొక్కిసలాట జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, సంబంధిత సిబ్బంది అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్యూలైన్లను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. భక్తులకు నిరంతరం మంచినీరు, అల్పాహారం అందుబాటులో ఉంచాలని, దర్శన వేళలు, దర్శనానికి పట్టే సమయం తదితర వివరాలను ఆలయ ప్రసార వ్యవస్థ ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. క్యూకాంప్లెక్స్‌లోని శౌచాలయాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం అన్నప్రసాద వితరణ భవనాన్ని పరిశీలించి, భక్తులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్తికమాసంలో భక్తుల రద్దీ పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని, అందుకు అనుగుణంగా అన్నప్రసాద వితరణ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. తదుపరి లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలను పరిశీలించి, ప్రసాదాల నిల్వల నమోదు, టికెట్ల జారీ విధానాన్ని సమీక్షించారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, ప్రసాదాల నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులు కోరినన్ని లడ్డూ ప్రసాదాలు అందించేందుకు తగిన నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ముఖ్యంగా శని, ఆది, సోమవారాలు, ప్రభుత్వ సెలవు రోజులు, పర్వదినాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రసాదాల తయారీ చేపట్టాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనంగా మూడు లడ్డూ కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు మహిళలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రసాద విక్రయ కేంద్రాల్లో భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా త్వరితగతిన ప్రసాదాలు అందించేలా చర్యలు చేపట్టాలని, సిబ్బంది భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. టికెట్ల జారీకి సంబంధించి ముందస్తు ప్రణాళికతో అవసరమైన చర్యలు చేపట్టాలని ఐటీ విభాగాన్ని ఆదేశించారు. ఈ పరిశీలనలో సహాయ కార్యనిర్వహణాధికారులు బి. మల్లికార్జునరెడ్డి, యం. హరియానాయక్, పర్యవేక్షకులు టి. హిమబిందు, అసిస్టెంట్ ఇంజినీరు సీతారమేష్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.









**క్యూ లైన్ ని పరిశీలిస్తున్న ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు ఈవో శ్రీనివాసరావు ఏఈఓ మల్లికార్జున్ రెడ్డి సూపరిండెంట్ హిమబిందు**

## శ్రీశైలంలో సంప్రదాయ నృత్య ప్రదర్శన




**తేదీ: 25.10.2026 । డ్రీమ్ టైమ్స్ తెలుగు శ్రీశైలం**

శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిత్యకళారాధన వేదికపై సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద తాండూరు, వికారాబాద్ జిల్లాకు చెందిన శ్రీ నటరాజ నృత్య అకాడమీ కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. వినాయక కౌత్వం, శివాష్టకం, నమశ్శివాయ తదితర గీతాలు, అష్టకాల ఆధారంగా ప్రణవి, మేఘన, భవ్య, గాయత్రి తదితర కళాకారులు తమ నృత్య ప్రదర్శనలతో భక్తులను అలరించారు. శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధనలో భాగంగా వివిధ రోజుల్లో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. శ్రీస్వామిఅమ్మవార్ల కైంకర్యాలు పరిపూర్ణంగా జరగాలని ఆకాంక్షిస్తూ, ప్రాచీన సంప్రదాయ కళలను పరిరక్షించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దేవస్థానం ఈ నిత్యకళారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

# నవంబరు నెల దర్శనం, ఆర్జితసేవల టికెట్లు విడుదల

**డ్రీమ్ టైమ్స్ । తేదీ: 25.10.2026 శ్రీశైలం**

శ్రీశైల దేవస్థానంలో నవంబరు నెలకు సంబంధించి శ్రీస్వామివారి స్పర్శదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం, ఆర్జితసేవలకు సంబంధించిన టికెట్లను విడుదల చేసినట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. భక్తులు సులభంగా టికెట్లు పొందేందుకు 80 శాతం టికెట్లను రాష్ట్ర ప్రభుత్వ మనమిత్ర వాట్సాప్ సేవ ద్వారా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. భక్తులు 9552300009 వాట్సాప్ నంబర్ ద్వారా టికెట్లు పొందవచ్చని తెలిపారు. మిగిలిన 20 శాతం టికెట్లను ఏపిటిఎస్ వెబ్‌సైట్ షష్ఎ.ఎం.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా పొందవచ్చని వెల్లడించారు.

**14 రకాల ఆర్జితసేవలకు టికెట్లు**

శ్రీస్వామివారి స్పర్శదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం టికెట్లతో పాటు ఆర్జిత గర్భాలయ అభిషేకం, ఆర్జిత సామూహిక అభిషేకం, కుంకుమార్చన, గణపతి హోమం, రుద్ర హోమం, మహామృత్యుంజయ హోమం, చండీ హోమం, కల్యాణోత్సవం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం తదితర 14 రకాల ఆర్జితసేవలకు సంబంధించిన టికెట్లను కూడా వాట్సాప్, ఆన్‌లైన్ ద్వారా పొందే సదుపాయం కల్పించినట్లు అధికారులు తెలిపారు. టికెట్లు పొందిన భక్తులు వాటి హార్డ్‌కాపీతో పాటు ఆధార్ కార్డు ఒరిజినల్ లేదా జిరాక్స్ కాపీని తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. టికెట్లను స్కాన్ చేసి, ఆధార్ గుర్తింపు వివరాలను పరిశీలించిన అనంతరం మాత్రమే సంబంధిత ఆర్జితసేవలకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం పరిధిలో పలుచోట్ల మనమిత్ర వాట్సాప్ సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 4.30 గంటల నుంచి ఉచిత సర్వదర్శనం యథావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

**కార్తికమాసంలో కొన్ని ఆర్జితసేవలు నిలిపివేత**

కార్తికమాసం సందర్భంగా 2026 నవంబరు 10 నుంచి డిసెంబరు 9 వరకు శ్రీస్వామివారి గర్భాలయ అభిషేకం (రూ.5,000), సామూహిక అభిషేకాలు (రూ.1,500), ఉదయాస్తమానసేవ, ప్రాతఃకాలసేవ, ప్రదోషకాలసేవలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆర్జిత హోమాలు, కల్యాణోత్సవం తదితర సేవలు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించారు. కార్తికమాసంలో రద్దీ రోజుల్లో అమ్మవారి అంతరాలయంలో నిర్వహించే రూ.1,000 కుంకుమార్చనను అమ్మవారి ఆశీర్వచన మండపంలో నిర్వహించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. భక్తులు దర్శనం, ఆర్జితసేవల టికెట్లను ముందుగానే పొందుతూ దేవస్థానం నిబంధనలను పాటించాలని అధికారులు సూచించారు.

# బిజినెస్

## వెండి ధర పతనం..

-నాలుగు రోజుల్లో రూ.16,503 తగ్గుదల!
-కిలో వెండి ధర రూ.1,94,415కు చేరిక
-పసిడి ధరల్లోనూ తగ్గుదలతో కొనుగోలుదారులకు ఊరట
-అంతర్జాతీయ పరిణామాలతో బులియన్ మార్కెట్‌లో మార్పులు




న్యూఢిల్లీ

దీపావళి, ధన్‌తేరస్ పండుగల వేళ బంగారం, వెండి కొనుగోలుదారులకు ఊరట లభిస్తోంది. దేశీయ బులియన్ మార్కెట్‌లో విలువైన లోహాల ధరలు దిగివస్తున్నాయి. ముఖ్యంగా వెండి ధర భారీగా తగ్గింది. కేవలం నాలుగు రోజుల్లోనే కిలో వెండిపై రూ. 16,503 తగ్గుదల నమోదైంది. అక్టోబర్ 16న రూ. 2,10,918గా ఉన్న కిలో వెండి ధర శుక్రవారం నాటికి రూ. 1,94,415కు చేరింది. పండుగల సీజన్‌లో వెండి ధర తగ్గడం కొనుగోలుదారులకు కొంత ఉపశమనం కలిగిస్తోంది. మరోవైపు బంగారం ధరల్లోనూ తగ్గుదల కనిపించింది. దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,41,630కు చేరగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,38,230గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న పరిణామాలు, ముడిచమురు ధరల పెరుగుదల, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై అంచనాలు బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. పండుగల సందర్భంగా ఆభరణాలు, వెండి వస్తువుల కొనుగోళ్లకు సిద్ధమవుతున్న వినియోగదారులకు తాజా ధరల తగ్గుదల అనుకూలంగా మారింది. అయితే అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా విలువైన లోహాల ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగవచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## నవంబర్ 1 నుంచి మొబైల్ వినియోగదారులకు కొత్త నిబంధనలు

- కాలర్ నేమ్ ప్రజెంటేషన్ విధానాన్ని అమలు చేయనున్న కేంద్రం
- తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చినా ఫోన్ తెరపై పేరు
- తొలుత 4జీ, 5జీ వినియోగదారులకు అందుబాటులోకి సేవలు
- తదుపరి దశలో 2జీ, 3జీ నెట్‌వర్క్‌లకూ విస్తరణ
- సైబర్ మోసాలు, నకిలీ కాల్స్‌కు అడ్డుకట్టే లక్ష్యం




న్యూఢిల్లీ

దేశవ్యాప్తంగా మొబైల్ వినియోగదారులకు నవంబర్ 1 నుంచి కొత్త సదుపాయం అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. సైబర్ మోసాలు, గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే అనుమానాస్పద కాల్స్‌ను నియంత్రించేందుకు కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ కాలర్ నేమ్ ప్రజెంటేషన్ (సీఎన్‌ఏపీ) విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ విధానం ద్వారా మొబైల్ ఫోన్‌లో సేవ్ చేయని నంబర్ నుంచి కాల్ వచ్చినప్పటికీ కాల్ చేస్తున్న వ్యక్తి పేరు ఫోన్ తెరపై కనిపిస్తుంది. టెలికాం సంస్థల వద్ద నమోదైన వివరాల ఆధారంగా కాలర్ పేరును ప్రదర్శించేలా ఈ వ్యవస్థను రూపొందించారు. కొత్త విధానాన్ని తొలిదశలో 4జీ, 5జీ నెట్‌వర్క్ వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు సమాచారం. అనంతరం 2జీ, 3జీ నెట్‌వర్క్‌లకు కూడా విస్తరించనున్నారు. ప్రస్తుతం గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్ విషయంలో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీఎన్‌ఏపీ విధానం అమల్లోకి వస్తే కాల్ చేస్తున్న వ్యక్తి వివరాలను ముందుగానే తెలుసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా అనుమానాస్పద కాల్స్‌ను గుర్తించేందుకు వినియోగదారులకు అదనపు సౌలభ్యం కలగనుంది. ఇటీవలి కాలంలో బ్యాంకు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల పేరుతో నకిలీ కాల్స్ చేసి ప్రజలను మోసగిస్తున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ విధానానికి ప్రాధాన్యం ఏర్పడింది. అయితే కాలర్ పేరు కనిపించినంత మాత్రాన ఆ కాల్ పూర్తిగా సురక్షితమైనదని భావించరాదని, ఓటీపీలు, బ్యాంకు ఖాతాల వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులకు వెల్లడించకుండా అప్రమత్తంగా ఉండాలని సైబర్ భద్రతా నిపుణులు సూచిస్తున్నారు.

## ఏసర్ నుంచి సరికొత్త బిజినెస్ ల్యాప్‌టాప్!

- భారత మార్కెట్లో ట్రావెల్‌లైట్ టీఎల్44-53ఎం-జీ2 విడుదల
- ఎంటర్‌ప్రైజ్ వినియోగదారుల కోసం ప్రత్యేకంగా రూపకల్పన
- ఇంటెల్ కోర్ అల్ట్రా సిరీస్ 3 ప్రాసెసర్లతో అత్యాధునిక సాంకేతికత
- 14 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే
- వీడియో కాల్స్ కోసం 5 మెగాపిక్సెల్ ఐఆర్ వెబ్‌క్యామ్
- ధర, పూర్తి కాన్ఫిగరేషన్ వివరాలు వెల్లడించని సంస్థ



న్యూఢిల్లీ

ప్రముఖ కంప్యూటర్ తయారీ సంస్థ ఏసర్ భారత మార్కెట్లో మరో కొత్త బిజినెస్ ల్యాప్‌టాప్‌ను ఆవిష్కరించింది. కార్పొరేట్ సంస్థలు, వ్యాపార అవసరాలను దృష్టిలో ఉంచుకుని 'ఏసర్ ట్రావెల్‌లైట్ టీఎల్44-53ఎం-జీ2' పేరుతో ఈ ల్యాప్‌టాప్‌ను విడుదల చేసింది. ఎంటర్‌ప్రైజ్ వినియోగదారులకు అనువుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని రూపొందించినట్లు సంస్థ తెలిపింది. కార్యాలయ కార్యకలాపాలు, వృత్తిపరమైన అవసరాలకు ఉపయోగపడేలా పలు ప్రత్యేకతలను అందించింది. ఈ ల్యాప్‌టాప్‌లో ఇంటెల్ కోర్ అల్ట్రా సిరీస్ 3 ప్రాసెసర్లను అమర్చారు. అలాగే 14 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లేను అందించారు. వీడియో కాన్ఫరెన్స్‌లు, ఆన్‌లైన్ సమావేశాల కోసం 5 మెగాపిక్సెల్ ఐఆర్ వెబ్‌క్యామ్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా వ్యాపార సంస్థలు, కార్పొరేట్ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ మోడల్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చారు. అయితే ఈ ల్యాప్‌టాప్ ధర, ర్యామ్, స్టోరేజ్, బ్యాటరీ సామర్థ్యం సహా పూర్తి కాన్ఫిగరేషన్ వివరాలను కంపెనీ ఇంకా వెల్లడించలేదు. కమర్షియల్ విక్రయ మార్గాల ద్వారా ఈ పరికరాన్ని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానుంది. ధరతోపాటు ఇతర సాంకేతిక వివరాలను సంస్థ వెల్లడించాల్సి ఉంది.

## పోరాడి ఓడిన సింధు.. ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ యంగ్‌దే!

- మహిళల సింగిల్స్ ఫైనల్‌లో పీవీ సింధుకు నిరాశ
- ప్రపంచ నంబర్‌వన్ అన్ సె యంగ్ చేతిలో ఓటమి
- తొలి గేమ్ గెలిచి ఆశలు రేపిన భారత స్టార్ షట్లర్
- తర్వాతి రెండు గేమ్‌లలో ఆధిపత్యం చాటిన కొరియా క్రీడాకారిణి
- గంటకుపైగా సాగిన ఉత్కంఠభరిత టైటిల్ పోరు
- వరుసగా నాలుగోసారి ఫ్రెంచ్ ఓపెన్ కిరీటం యంగ్ కైవసం




పారిస్, అక్టోబర్ 25

ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ ఫైనల్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు నిరాశ ఎదురైంది. ప్రపంచ నంబర్‌వన్, దక్షిణ కొరియా సంచలనం అన్ సె యంగ్ చేతిలో పోరాడి ఓడిపోయింది. ఆదివారం పారిస్‌లోని అరెనా గ్రాండ్ వేదికగా జరిగిన తుదిపోరులో తొలి గేమ్‌ను సొంతం చేసుకున్న సింధు ఆ తర్వాత అదే జోరును కొనసాగించలేకపోయింది. మూడు గేమ్‌ల పాటు గంటకుపైగా సాగిన పోరులో అన్ సె యంగ్ 16--21, 21--11, 21--12 తేడాతో విజయం సాధించి మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్ పోరును సింధు దూకుడుగా ప్రారంభించింది. ప్రపంచ అగ్రశ్రేణి క్రీడాకారిణి అన్ సె యంగ్‌కు గట్టి పోటీ ఇస్తూ తొలి గేమ్‌లో ఆధిపత్యం ప్రదర్శించింది. అద్భుతమైన షాట్లు, సమర్థవంతమైన రిటర్న్‌లతో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టింది. కీలక సమయంలో పాయింట్లు సాధించి తొలి గేమ్‌ను 21--16తో సొంతం చేసుకుంది. దీంతో సింధు టైటిల్ గెలుచుకునే అవకాశాలు మెరుగుపడినట్లు కనిపించాయి. అయితే రెండో గేమ్ నుంచి అన్ సె యంగ్ తన ఆటతీరును పూర్తిగా మార్చుకుంది. వేగవంతమైన ర్యాలీలు, కచ్చితమైన షాట్లతో సింధుపై ఒత్తిడి పెంచింది. ప్రత్యర్థి దూకుడును అడ్డుకోవడంలో సింధు ఇబ్బందులు ఎదుర్కొంది. ఫలితంగా రెండో గేమ్‌ను యంగ్ 21--11తో గెలుచుకుని మ్యాచ్‌ను సమం చేసింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ కొరియా క్రీడాకారిణి అదే జోరును కొనసాగించింది. సింధు పుంజుకునేందుకు ప్రయత్నించినప్పటికీ యంగ్ ఆధిపత్యాన్ని అడ్డుకోలేకపోయింది. చివరకు మూడో గేమ్‌ను 21--12తో గెలుచుకున్న యంగ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది.

## అన్ సె యంగ్ ఖాతాలో మరో కిరీటం!

- ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ కైవసం
- ఈ సీజన్‌లో 11వ టైటిల్‌తో కొరియా స్టార్ సంచలనం
- ఫైనల్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధుపై విజయం
- తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకున్న యంగ్
- వరుసగా రెండు గేమ్‌లలో సింధుపై పూర్తి ఆధిపత్యం
- ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకుకు తగ్గ ప్రదర్శన
- సింధుపై విజయాల పరంపర కొనసాగించిన కొరియా షట్లర్
- అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో యంగ్ జైత్రయాత్ర




పారిస్, క్రీడా విభాగం

అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో దక్షిణ కొరియా స్టార్ షట్లర్ అన్ సె యంగ్ విజయపరంపర కొనసాగుతోంది. ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్‌గా తన ఆధిపత్యాన్ని చాటుకుంటున్న యంగ్ మరో ప్రతిష్ఠాత్మక టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచింది. భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధుతో జరిగిన ఫైనల్‌లో అద్భుత పోరాట పటిమను ప్రదర్శించి కిరీటాన్ని సొంతం చేసుకుంది. ఈ విజయంతో ప్రస్తుత సీజన్‌లో తన టైటిళ్ల సంఖ్యను 11కు పెంచుకున్నట్లు సమాచారం. ఒకే సీజన్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న యంగ్ మరోసారి తన సత్తాను నిరూపించుకుంది. ఆదివారం పారిస్‌లో జరిగిన మహిళల సింగిల్స్ తుదిపోరు ఆసక్తికరంగా సాగింది. తొలి గేమ్‌లో పీవీ సింధు అద్భుతంగా రాణించి కొరియా క్రీడాకారిణికి గట్టి పోటీ ఇచ్చింది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సింధు పదునైన స్మాష్‌లు, కచ్చితమైన రిటర్న్‌లతో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టింది. కీలక సమయంలో పాయింట్లు సాధించి తొలి గేమ్‌ను 21--16తో సొంతం చేసుకుంది. దీంతో ఫైనల్‌లో సింధు విజయం సాధించే అవకాశాలు కనిపించాయి. అయితే తొలి గేమ్‌లో ఎదురైన పరాజయంతో అన్ సె యంగ్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. రెండో గేమ్ నుంచి యంగ్ తన ఆటతీరును పూర్తిగా మార్చుకుంది. కోర్టులో వేగంగా కదులుతూ సింధు షాట్లను సమర్థంగా ఎదుర్కొంది. పొడవైన ర్యాలీల్లో పైచేయి సాధిస్తూ వరుస పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం ఇవ్వకుండా రెండో గేమ్‌ను 21--11తో గెలుచుకుంది. దీంతో మ్యాచ్ 1--1తో సమమైంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ కొరియా స్టార్ అదే దూకుడును కొనసాగించింది. సింధు ప్రతిఘటించేందుకు ప్రయత్నించినప్పటికీ యంగ్ ఆధిపత్యాన్ని అడ్డుకోలేకపోయింది. చివరకు మూడో గేమ్‌ను 21--12తో ముగించిన యంగ్ 16--21, 21--11, 21--12 స్కోరుతో విజేతగా నిలిచింది.

# స్పోర్ట్స్

## మూడో టీ20పై టీమిండియా గురి!

-న్యూజిలాండ్‌తో కీలక పోరుకు భారత్ సన్నద్ధం
-తొలి రెండు మ్యాచ్‌ల అనంతరం మూడో సమరంపై దృష్టి
-పర్యటనలో ఐదు వన్డేలు, రెండు టెస్టులు కూడా




స్పోర్ట్స్ డెస్క్

న్యూజిలాండ్ పర్యటనలో భారత క్రికెట్ జట్టు మూడో టీ20 మ్యాచ్‌పై దృష్టి సారించింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి రెండు పోటీలు ముగియడంతో తదుపరి మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. కివీస్ గడ్డపై సత్తా చాటేందుకు భారత ఆటగాళ్లు కసరత్తు చేస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచి మూడో టీ20లో విజయం సాధించాలనే లక్ష్యంతో టీమిండియా బరిలోకి దిగనుంది. న్యూజిలాండ్ జట్టు కూడా సొంతగడ్డపై భారత్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ పర్యటనలో ఐదు టీ20 మ్యాచ్‌లతో పాటు ఐదు వన్డేలు, రెండు టెస్టులు కూడా జరగనున్నాయి. దీంతో సుదీర్ఘ పర్యటనలో నిలకడైన ప్రదర్శన కనబరచడం భారత జట్టుకు కీలకంగా మారింది.



బాబోయ్ రెజీనా కాసాండ్రా..

# మెగా ఫ్యాన్స్‌కు అదిరిపోయే అప్‌డేట్..

## -ఆర్‌సీ 17 పూజా కార్యక్రమాలు ఎప్పుడంటే?



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ మరియు క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న ప్రాజెక్ట్ RC 17'. ఇండస్ట్రీలో సంచలనాత్మక విజయాలను నమోదు చేసిన 'రంగస్థలం' చిత్రం తర్వాత ఈ క్రేజీ కాంబో మరోసారి రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. ఈ సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందా అని మెగా అభిమానులు మరియు సినీ ప్రియులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న తరుణంలో, ఎట్టకేలకు మేకర్స్ నుంచి మోస్ట్ ఎవైటెడ్ అఫీషియల్ అప్‌డేట్ వచ్చేసింది.ఈ భారీ ప్రాజెక్ట్‌ను మొదటగా దసరా పండుగ రోజునే అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలతో లాంచ్ చేయాలని చిత్ర యూనిట్ భావించింది. అయితే ఆ సమయంలో ముహూర్తం సరిపడకపోవడం మరియు కొన్ని సాంప్రదాయ కారణాలరీత్యా ఈ ఓపెనింగ్ కార్యక్రమాన్ని కొద్దిరోజులు వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ తర్వాత అక్టోబర్ చివరి వారంలో ఈ సినిమా లాంఛింగ్ ఉంటుందని మైత్రీ మూవీ మేకర్స్ సహ నిర్మాత వై.రవిశంకర్ గతంలో హింట్ ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా జరిగిన ఒక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సినిమా పూజా కార్యక్రమాలకు సంబంధించిన ఖచ్చితమైన తేదీని అధికారికంగా రివీల్ చేశారు. వచ్చే నెల నవంబర్ 1వ తేదీన ఎంతో గ్రాండ్‌గా '=జ 17' పూజా కార్యక్రమాలను నిర్వహించి ఈ చిత్రాన్ని అధికారికంగా లాంచ్ చేయబోతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కేవలం పూజతో సరిపెట్టకుండా, లాంఛింగ్ పూర్తయిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా రెగ్యులర్ షూటింగ్ పనులను కూడా శరవేగంగా ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. సుకుమార్ మార్క్ మేకింగ్, రామ్‌చరణ్ గ్లోబల్ ఇమేజ్ తోడవుతుండటంతో ఈ సినిమా ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఎట్టకేలకు సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు కావడంతో మెగా అభిమానులు ప్రస్తుతం ఫుల్ ఖుష్ అవుతున్నారు మరియు సోషల్ మీడియాలో ఈ అప్‌డేట్‌ను ట్రెండ్ చేస్తున్నారు.

# నితిన్ 'అలియాస్ రుక్మిణి' నుంచి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్!

నేచురల్ స్టార్ నాని సమర్పణలో టాలెంటెడ్ హీరో నితిన్ నటిస్తున్న తాజా చిత్రం 'అలియాస్ రుక్మిణి'. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ ఫీల్ గుడ్ ఫ్యామిలీ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ నుంచి తాజాగా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్ అప్‌డేట్‌ను అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో కృష్ణ పాత్రలో నటిస్తున్న నితిన్, రుక్కుతో ప్రేమలో పడే నేపథ్యంలో సాగే సుందరమైన రొమాంటిక్ గీతం 'రుక్కు రుక్కు రుక్మిణి' ఫస్ట్ సింగిల్‌ను అక్టోబర్ 27న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది.ఈ చిత్రంలో నితిన్ సరసన ఆఫియా సయ్యద్ నాయికగా నటిస్తుండగా, సాయి కుమార్, హర్షవర్ధన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. యానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి గంటా ఈ సినిమాను నిర్మిస్తుండగా, విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు మరియు జోమన్ టి. జాన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ సినిమా డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.



# విజయ్ నా లక్కీఛార్మ్!

సినీరంగంలో కొన్ని కాంబినేషన్స్‌కు మంచి క్రేజ్ ఉంటుంది. అలాంటి వాటిలో దళపతి విజయ్-సమంత కాంబో ఒకటి. వీరిద్దరూ కలిసి కత్తి, తెరి, మెర్సల్ చిత్రాల్లో నటించారు. ఈ మూడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాల్ని సాధించాయి. దీంతో ఈ జంటను సూపర్‌హిట్ జోడీ అని పిలుస్తుంటారు. తాజాగా ఈ విషయమై సమంత ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం తమిళంలో 'సెలబ్రిటీ మాస్టర్ చెఫ్' షోకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నది సమంత.ఈ సందర్భంగా ఓ ఎపిసోడ్‌లో విజయ్ గురించి సమంత మాట్లాడింది. విజయ్‌తో తాను కలిసి నటించిన మూడు చిత్రాలు హిట్ కావడంతో ఆయన తన లక్కీఛార్మ్‌గా భావిస్తానని సమంత పేర్కొన్నది. సినిమాల్లో అగ్రస్థానంలో ఉన్న సమయంలోనే విజయ్ నటనకు స్వస్తి చెప్పి రాజకీయాల్లో రాణించడం సాధారణ విషయం కాదని అభిప్రాయపడింది. వ్యక్తిగా విజయ్ కోట్ల మందికి స్ఫూర్తినిచ్చారని, నాయకుడిగా కూడా ఆయన ఎంతో కష్టపడుతున్నారని సమంత ప్రశంసలు కురిపించింది.



# ఓటీటీలోకి విజయ్ సేతుపతి సూపర్ హిట్ మూవీ 'బత్తా'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?




కోలీవుడ్ స్టార్ హీరో, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటించిన లేటెస్ట్ యాక్షన్ కామెడీ డ్రామా మూవీ 'బత్తా' ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు బాలాజీ తరణీతరణ్ తెరకెక్కించిన ఈ చిత్రంలో విజయ్ సేతుపతి నటనకు, విభిన్నమైన కథాంశానికి థియేటర్లలో అద్భుతమైన ప్రశంసలు దక్కాయి.1980ల నాటి మద్రాస్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ గ్యాంగ్‌స్టర్ కామెడీ ఎంటర్టైనర్‌లో లిజోమోల్ జోస్, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. థియేటర్లలో మంచి టాక్ తెచ్చుకున్న ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు లాక్ అయింది. అక్టోబర్ 29, 2026 నుండి తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ మరియు మలయాళ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులు, నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.

# షారుఖ్ ఖాన్ పుట్టినరోజు కానుక..

## -థియేటర్లలోకి 'డిడిఎల్‌జె' రీ-రిలీజ్!



బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ సిద్ధమవుతోంది. షారుఖ్ కెరీర్‌లో ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన కల్ట్ క్లాసిక్ లవ్ స్టోరీ 'దిల్ వాలే దుల్హానియా లే జాయేంగే' చిత్రాన్ని ఆయన పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేకంగా థియేటర్లలో రీ-రిలీజ్ చేయనున్నారు.షేర్ బాగ్, పివిఆర్, ఐనాక్స్ వంటి ప్రముఖ మల్టీప్లెక్స్ చైన్లలో పరిమిత స్క్రీన్‌లలో ఈ సినిమాను ప్రదర్శించనున్నారు. రాజ్ అండ్ సిమ్రాన్ ల మ్యాజికల్ లవ్ స్టోరీని మరోసారి బిగ్ స్క్రీన్‌పై చూసేందుకు అభిమానులు ఎంతగానో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు షారుఖ్ బర్త్‌డే కావడంతో ఆయన నటించిన మోస్ట్ అవేటెడ్ మూవీ 'కింగ్' టీజర్‌ను కూడా విడుదల చేయనున్నట్లు సమాచారం.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831